Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 20.01.2017, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 33 పేజీలు : 12, వెల : ₹ 5


ISO 9001-2008
Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
CARE
SUPER SPECIALITY
DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For
State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



- అరచేతిలో స్వర్గం.. ఆచరణలో నరకం
- కూలీలుగా మారిన రైతులు
- కూటికోసం పాట్లు పడుతున్న కూలీలు
- పచ్చని పొలాలు ఇప్పుడు బీళ్ళు

## త్వరలో తెరపై...

# అమరావతి కన్నీటి గాథలు


చరిత్రలో మనం చదువుకున్న అమరావతి వేరు... భవిష్యత్‌లో మనం చూడబోయే అమరావతి వేరు. చరిత్రను పరిశీలిస్తే అమరావతి కేంద్రంగా రాజ్యాలు, సామ్రాజ్యాలు వెలిసాయి. భిన్న సంస్కృతులు, విభిన్న మతసాంప్రదాయాలు అక్కడ వెలసిల్లాయి. ఈ దేశపు ధాన్యాగారంగా వర్థిల్లింది. అమరావతి కేంద్రంగా ఎన్నో చారిత్రాత్మక కథలు చదువుకున్నాం. అంతెందుకు ఇటీవల బాలకృష్ణ హీరోగా నటించి విడుదలైన 'గౌతమిపుత్ర శాతకర్ణి' సినిమా చరిత్ర కూడా అమరావతి రాజ్యానిదే! ఇది చరిత్ర. ఇక భవిష్యత్ ఎలా ఉండబోతోంది...

(మిగతా 11వ పేజీలో)

- కాపుల చీలిక...

# చంద్రబాబు పాచిక

- పవనే ప్రధాన అస్త్రం



**2014 ఎన్నికల్లో తెలుగుదేశం అధికారంలోకి రావడానికి ప్రధాన కారణాలలో ఒకటి రాష్ట్రంలో అధికసంఖ్యలో ఉన్న కాపులు ఆ పార్టీకి మద్దతు తెలపడం. ఈ రాష్ట్రంలో కాపులు మొదటినుండి కాంగ్రెస్‌కు బలమైన మద్దతుదారులు. రాష్ట్ర విభజనకు ముందంతా కూడా రెడ్డి, కాపు కాంబినేషన్ కొనసాగుతూ వచ్చింది. రెడ్ల ఆధిపత్యం వహించే జిల్లాల్లో కాపులు పెద్దగా లేరు. వాళ్ళ రెడ్లను బలపరిచే వాళ్లు. కాపుల ప్రాబల్యం వున్న కృష్ణ, గోదావరి జిల్లాల్లో రెడ్లు అల్ప సంఖ్యాకులు. వీళ్ల కాపులకు మద్దతుదారులు. ఈ మూడు జిల్లాల్లోనూ కాపులకు ప్రధాన ప్రత్యర్థులు కమ్మ సామాజిక వర్గీయులే! కాబట్టి కాపు-కమ్మ మధ్య ఆ వైరం ఉండేది. 1989లో వంగవీటి రంగ హత్య తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో ఈ రెండు వర్గాల మధ్య చిచ్చు బాగా రేగింది.**

అయితే, విభజన తర్వాత రాష్ట్రంలో పరిస్థితులు మారిపోయాయి. కాంగ్రెస్ పతనమైంది. వై.యస్. వంటి నాయకుడు లేడు. కాంగ్రెస్‌లో ఇమడలేని కాపులు అనుభవం లేని జగన్‌ను నమ్మలేకపోయారు. అదే సమయంలో కాపు ఓట్లకు చంద్రబాబు బలమైన గాలం వేసారు. డిప్యూటీ సీఎం ఎరతో పాటు, కాపులకు రిజర్వేషన్లు, పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ అనే ఎరలను ఆ గాలానికి తగిలించారు. దీంతో కాపులు తెలుగుదేశంవైపు మొగ్గుచూపడంతో చంద్రబాబు సీఎం కుర్చీ ఎక్కగలిగారు.

తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక పరిస్థితులు మారాయి. కాపు కోటా నుండి నిమ్మకాయల చినరాజప్పకు డిప్యూటీ సీఎం కుర్చీ ఇచ్చారు. దీనివల్ల ఆయనకు వ్యక్తిగతంగా పదవి రావడం తప్పించి కాపులకు ఒరిగిందేమీ లేదు. కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. దీనివల్ల వచ్చే ప్రయోజనాలు నామమాత్రం. కాపులు పూర్తిగా లబ్ధిపొందగలిగేది బి.సి రిజర్వేషన్లు ఇస్తేనే! దీనిపై చంద్రబాబు దాటవేత ధోరణి అవలంభిస్తున్నాడు. ఏ సబ్జెక్టైనా తేల్చకుండా నాన్చుడంలో చంద్రబాబు అనుభవజ్ఞుడు. దీనిని సాగదీయడానికే కాపు రిజర్వేషన్ల

(మిగతా 11వ పేజీలో)

# ఖేలో... సింహపురి!




# నెల్లూరుకు శని పట్టిందా...?




# ఒక్కడికే...

→ మంత్రివర్గంలోకి లోకేష్



తెలంగాణ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కన్నా ఆయన తనయుడు ఐ.టి మంత్రి కేటీఆర్ చురుకైన పాత్ర పోషిస్తున్నారు. గ్రేటర్ ఎన్నికల్లో ఒంటిచేత్తో టీఆర్ఎస్‌ను గెలిపించింది ఆయనే! అసెంబ్లీలో ప్రతిపక్షాలను ధీటుగా ఎదుర్కొంటున్నది కూడా కేటీఆరే! అతని పనితీరును ప్రధానితో సహా పలువురు కేంద్రమంత్రులు కూడా మెచ్చుకున్నారు.

చంద్రబాబుకు కూడా తన కొడుకు లోకేష్‌ను అదే రీతిలో తీర్చిదిద్దాలనే ఆలోచన వుంది. చంద్రబాబు రాజకీయ వారసుడు లోకేషే! ఇప్పటికే ఆయనను పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శిగా పెట్టి వున్నారు. లోకేష్ రాజకీయ వ్యవహారాల కంటే పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా ఆర్థిక వ్యవహారాలు ఎక్కువుగా చూస్తున్నారు. అయితే అసలు రాజకీయాలు, ప్రతిపక్షాల

(మిగతా 11వ పేజీలో)



# చిరస్మరణీయుడు ఎన్టీఆర్




తెలుగు చిత్రసీమ రారాజు, తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 21వ వర్ధంతి కార్యక్రమాలను బుధవారం నెల్లూరు నగరంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నెల్లూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో లెజండరీ మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్సీలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, నగర మేయర్ అబ్దుల్ అజీజ్ ప్రారంభించారు. ముందుగా నెల్లూరు నగర ఇన్‌ఛార్జి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్ళపాక రమేష్‌రెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడు, జడ్.శివప్రసాద్‌లు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నెల్లూరులోని 54డివిజన్ల నుంచి పార్టీ కార్యకర్తలు, అనుబంధ సంఘాలు, నందమూరి అభిమానులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం సోమిరెడ్డి, బీద, అజీజ్ మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆరాధ్య దైవం, తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని పెంచిన ఎన్టీఆర్ 21వ వర్ధంతిని రాష్ట్ర వ్యాప్తంగా గ్రామగ్రామాన జరుపుకోవడం తెలుగుజాతికి గర్వకారణమన్నారు.

ఎన్టీ రామారావు 21వ వర్ధంతి సందర్భంగా అఖిలభారత ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు, మాజీమంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరు ఆర్ఆర్ వీధి, నర్తకి సెంటర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఎమ్మెల్సీలు సోమిరెడ్డి, బీద, నాయకుడు రమేష్‌రెడ్డిలు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఎన్టీఆర్ కృషి చేసారన్నారు. తెలుగుగంగ, కండలేరు, హంద్రీనీవా, గాలేరు, నగరి వంటి ప్రాజెక్టులు ఎన్నో తీసుకొనివచ్చి రైతులకు అండగా నిలిచారని కొనియాడారు. ప్రజల హృదయాల్లో ఎన్టీఆర్ చిరస్మరణీయులన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# సిద్దేశ్వర పీఠం శతాబ్ది వేడుకలు

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట పప్పులవీధి చివరగల గురుదత్తాత్రేయ మఠంలో కుర్తాళ సిద్దేశ్వర పీఠం ఆస్థాన పండితులు బ్రహ్మశ్రీ మాచవోలు రాజశేఖరశాస్త్రి, బ్రహ్మశ్రీ మాచవోలు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో సిద్దేశ్వర పీఠం శతాబ్ది వేడుకలు, కుర్తాళం సిద్దేశ్వర పీఠాధిపతులు జగద్గురు శ్రీ సిద్దేశ్వరానంద భారతీ మహాస్వామి వారి 81వ జన్మదిన వేడుకలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం నుండి ప్రత్యేకపూజలు, విశేషహోమాలను నిర్వహించారు. రాత్రి సిద్దేశ్వరపీఠం సిఇఓ చామర్తి ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాతాజీ రమ్యయోగిని, ముఖ్యఅతిథులుగా నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, నగర డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, హిందూధర్మ పరిరక్షణ ట్రస్టు కన్వీనర్ కోట సునీల్‌కుమార్, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ సిద్దేశ్వరానంద భారతీ మహాస్వామి భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. ఉపన్యాసకులుగా చింతలపాటి పూర్ణానందశాస్త్రి, ఆలూరు శిరోమణిశర్మలు వ్యవహరించారు. బుధవారం రాత్రి తొలిసారిగా నెల్లూరులో సౌభాగ్య సరస్వతీదేవి బ్రహ్మదేవుల కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. కుర్తాళ సిద్దేశ్వర పీఠ ఆస్థాన పండితులు మాచవోలు రాజశేఖరశాస్త్రి, మాచవోలు రమేష్‌శర్మ, మాచవోలు కోటేశ్వరశర్మ కళ్యాణాన్ని జరిపించారు. కుర్తాళం పీఠాధిపతులు శ్రీ సిద్దేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు. ముఖ్యఅతిథులుగా మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు ఆనం జయకుమార్‌రెడ్డి, కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్, నగర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను గురుదత్తాత్రేయ మఠం ధర్మాధికారి డాక్టర్ పి.మధుసూదనశాస్త్రి పర్యవేక్షించారు.

# బోడిగాడితోటలో డంపింగ్‌యార్డ్ వద్దు

**ఓబిలి రవిచంద్ర**

నెల్లూరు పెన్నానది ప్రక్కనున్న బోడిగాడితోట(హిందూ శ్మశానవాటిక)లో డంపింగ్ యార్డ్ వద్దని, జన సంచారంలేని ప్రాంతాల్లో దానిని ఏర్పాటు చేయాలని వైయస్సార్‌సిపి 5వ డివిజన్ కార్పొరేటర్ ఓబిలి రవిచంద్ర డిమాండ్ చేశారు. సోమవారం రవిచంద్ర ఆధ్వర్యంలో చెత్తను తరలించే 30వాహనాలను నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. చెత్త ఇక్కడ వేయడంతో ఇక్కడ నివసిస్తున్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారని రవిచంద్ర మండిపడ్డారు. వాహనాలను బోడిగాడితోటలోకి రానివ్వకపోవడంతో కార్పొరేషన్ అధికారులు ఎంఇ ఆసిఫ్, శానిటరి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. వారు రంగప్రవేశం చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. స్థానికులు నిరసన తెలిపిన వారికి అండగా నిలవడంతో వాహనాలు వెనుదిరిగాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్ రవిచంద్ర మాట్లాడుతూ ఇక్కడ చెత్త వేసినందువల్ల గత ఏడాది డెంగీ వ్యాధితో ఏడుగురు మృతి చెందారన్నారు. పదిరోజుల క్రితం టిబి వ్యాధితో ఓ వ్యక్తి మృతి చెందాడన్నారు. చెత్త వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో బోడిగాడితోటలోనికి అనుమతించేది లేదన్నారు. వైయస్సార్‌సిపి నాయకులు శివ, కిరణ్, బషీర్, జయ, పెంచలయ్య, కుమార్, అల్లాబక్షు, మహబూబ్‌బాష, బాబూరావు పాల్గొన్నారు.

# ఇఫ్కో భూముల వివరాలు ఇవ్వండి

**హైకోర్టు ఉత్తర్వులు**

కొడవలూరు మండలం రాచర్లపాడు వద్దగల ఇఫ్కో కిసాన్ సెజ్ భూముల వివరాలివ్వాలని హైకోర్టు నెల్లూరు ఆర్డీవో వెంకటేశ్వర్లుకు ఉత్తర్వులు జారీ చేసింది. 1995లో ఇఫ్కో కర్మాగారం ఏర్పాటు చేస్తామని భూములు సేకరించారని, ఇంతవరకు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయకపోగా, కాలుష్యం వెదజల్లే ఫ్యాక్టరీలను ఏర్పాటు చేస్తున్నారని, వీటిని నిరోధించడంతో పాటు రైతుల నుండి సేకరించిన భూములను తిరిగి రైతులకే ఇవ్వాలని కోరుతూ జడ్పీటీసీ ఇ.శ్రీధర్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు బెజవాడ గోవిందరెడ్డిలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసారు. ఈ పిటిషన్ విచారణకు స్వీకరించిన హైకోర్టు భూముల వివరాలు తెలపాలంటూ ఆర్డీఓను కోరింది. ఈ నెల 24న ఈ వ్యాజ్యంపై విచారణ జరుగనుంది. కొడవలూరు తహశీల్దార్ రామకృష్ణ సెజ్ పరిధిలోని భూముల వివరాలు సేకరించి మంగళవారం హైకోర్టుకు సమర్పించారు. త్వరలో ఇఫ్కో భూముల వివాదంపై కీలక తీర్పు వెలువడే అవకాశముంది.

# వైభవంగా గోపూజ మహోత్సవం

సంక్రాంతి పర్వదినం సందర్భంగా నెల్లూరు మూలాపేటలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో ఆదివారం గోపూజ మహోత్సవాన్ని నిర్వహించారు. టిటిడి, హిందూ ధర్మ ప్రచారపరిషత్, హిందూ ధర్మ ప్రచార మండలి, వేణుగోపాలస్వామి దేవస్థానం పాలకమండలి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీనివాస అయ్యంగార్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. హిందూ ధర్మ ప్రచార మండలి జిల్లా అధ్యక్షులు సి.వి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు కొండా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మకర సంక్రాంతి, కనుమ పండుగను పురస్కరించుకుని గోవును కాపాడుకుందాం... గోజాతిని రక్షిద్దాం అనే నినాదంతో నెల్లూరుజిల్లాలోని 10 నియోజకవర్గాల్లో ఎంపిక చేసిన ఆలయాలు, ఇతర ప్రాంతాల్లో గోపూజను నిర్వహించామన్నారు. అనంతరం స్వామివారు శేషవాహనంపై కనుమ పారువేట ఉత్సవానికి బయలుదేరి వెళ్లారు. గుండాల గురవయ్య ఆలపించిన అన్నమయ్య కీర్తనలు, కోలాటాలు, భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి. హిందూధర్మ ప్రచారమండలి సభ్యులు వేమిరెడ్డి సనత్‌కుమార్‌రెడ్డి, కొంపె గిరిజాకుమారి, శ్రీనివాసమూర్తి, దేవస్థానం ఛైర్మెన్ ఆనం చంద్రశేఖర్‌రెడ్డి, మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఆలయ మేనేజర్ గిరికృష్ణ తదితరులు పర్యవేక్షించారు.

# మిస్టర్ ఆంధ్ర పోటీల్లో నెల్లూరీయులు

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆదివారం జరిగిన మిస్టర్ ఆంధ్రారాష్ట్ర స్థాయి శరీర సౌష్టవ పోటీల్లో నెల్లూరు క్రీడాకారులు తమ ప్రతిభను చాటారు. వివరాలను నెల్లూరుజిల్లా అమెచ్యూర్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డివి పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. నెల్లూరుజిల్లాకు చెందిన ఏ.రజనీకాంత్ 60కిలోల విభాగంలో బంగారు పతకం, ఏధన శ్రీనివాస్ 85కిలోల విభాగంలో బంగారు పతకం, కె.రవి 80కిలోల విభాగంలోను, వై.రాజేంద్ర 90 కిలోల విభాగంలోను రజత పతకాలను సాధించారన్నారు. టీమ్‌కోచ్‌గా వి.శ్రీనివాస్ వ్యవహరించారని పేర్కొన్నారు.

# నేత్రపర్వంగా సాయినాథుని తెప్పోత్సవం

నెల్లూరుజిల్లా వెంకటగిరి కుమ్మరిగుంట బాబా ఆశ్రమం వద్ద ఆదివారం తెప్పోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం దేవస్థానం స్వామివారికి ప్రత్యేకాభిషేకాలు, హారతి కార్యక్రమాలు జరిపారు. సాయంత్రం బాబాకు పిస్తాపప్పులతో విశేషాలంకారం నిర్వహించారు. రాత్రి కుమ్మరిగుంట పుష్కరిణిలో బాబా తెప్పోత్సవం ప్రారంభమైంది. వెంకటగిరి పట్టణం నుంచే కాకుండా, డక్కిలి, బాలాయపల్లి, శ్రీకాళహస్తి మండలాల నుంచి రూరల్ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ప్రత్యేకంగా వివిధ పుష్పాలతో అందంగా అలంకరించిన తెప్పలో, సింహవాహనంపై బాబా భక్తులకు దర్శనమిచ్చారు. సాయినామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. కుమ్మరిగుంట పుష్కరిణిలో ఏర్పాటు చేసిన బాబా 30అడుగుల విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. సిఐ శ్రీనివాసరావు, ఎస్సై కొండపనాయుడు బందోబస్తును ఏర్పాటు చేశారు.

### కృష్ణమందిరంలో
# టిటిడి ఛైర్మెన్ పూజలు

నెల్లూరుజిల్లా నాయుడుపేట పట్టణంలోని శివాలయం వద్దనున్న శ్రీకృష్ణ మందిరంలో టిటిడి ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి కుటుంబసభ్యులతో కలిసి సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి స్వర్ణముఖినది వద్దకు చేరుకుని ఏటి పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. టిటిడి ఛైర్మెన్‌తో పాటు ఆర్యవైశ్య సంఘ నాయకులు కోట వెంకటేశ్వర్లు, నాయకులు కరింబాయి చెంచయ్య, తిమ్మాజీకండ్రిగ సర్పంచ్ పల్లేటి రమణయ్య పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ ఓటర్ల
# జాబితా సిద్ధం

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నెల్లూరుజిల్లా పట్టభద్రులు, ఉపాధ్యాయుల తుది ఓటర్ల జాబితాను జిల్లా యంత్రాంగం సిద్ధం చేసింది. తుది జాబితాను సోమవారం ప్రచురించారు. పట్టభద్రులు 75,494, ఉపాధ్యాయులు 5,977మంది ఓటర్లతో జాబితాను తయారు చేశారు. ఇందులో అనర్హుల ఓట్లు నమోదు చేశారంటూ ప్రజాసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

### రూ.20 కోట్లతో
# బారాషహీద్ దర్గా అభివృద్ధి

నెల్లూరులో ప్రతిష్టాత్మకంగా రొట్టెల పండుగ నిర్వహించే బారాషహీద్ దర్గాను రూ. 20కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. శనివారం నెల్లూరు హరనాథపురంలోని తన నివాసంలో దర్గా అభివృద్ధిపై ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేకబృందంతో సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గత ఏడాది రొట్టెలపండుగ సమయంలో సీఎం చంద్రబాబునాయుడు దర్గా అభివృద్ధికి రూ. 20కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో భారీ వాటర్ ఫౌంటెన్‌తో పాటు వివిధ రకాల అభివృద్ధి పనులు చేయనున్నట్లు పేర్కొన్నారు.

# నెల్లూరుకి శని పట్టిందా...?

- నగరమంతా పోస్టర్లు, ఫ్లెక్సీలు
- ఎటు చూసినా మురుగుదిబ్బలు.. ఇదేనా స్వచ్ఛభారత్?
- మేమింతే అంటున్న కార్పొరేషన్ సిబ్బంది
- కరువైపోయిన శాంతిభద్రతలు



స్వాతంత్ర్య సమరం నుంచి సారా వ్యతిరేకోద్యమం దాకా ఉద్యమాలకు ఊపిరిపోసిన జిల్లా నెల్లూరుజిల్లా. గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఎందరో చరిత్రాత్మక నాయకులకు, ఉద్ధండ రాజకీయ నేతలకు జన్మనిచ్చిన జిల్లా నెల్లూరుజిల్లా. అంతర్జాతీయ స్థాయిలో అంతరిక్ష రంగంలో సంచలనాలకు మారుపేరుగా పిలవబడుతున్న జిల్లా నెల్లూరుజిల్లా. దాన కర్ణులకు - దాన ధౌరేయులకు పేరు గాంచిన జిల్లా నెల్లూరుజిల్లా. అలాంటి జిల్లా కేంద్రమైన నెల్లూరు పాలకుల నిర్లక్ష్యానికి గురైంది. నెల్లూరు నగరం ఏం పాపం చేసుకుందో, నగరవాసులకు ఏ శాపం తగిలిందో తెలియదుగాని అత్యంత దయనీయంగా నెల్లూరు స్థితి మారి పోయింది. దీనావస్థలతో నగరం నలిగిపోతోంది.









ఈ నెల్లూరుకు గ్రహణం పట్టింది. నెల్లూరు నగర కార్పొరేషన్ బాగుచేయలేని ఎయిడ్స్ వ్యాధి కంటే దారుణమైన వ్యాధితో బాధపడుతోంది. నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా అధికారులు, సిబ్బంది కుమ్మక్కై పందికొక్కుల్లా దోచుకుంటూ పట్టణాన్ని అధోగతిపాలు చేస్తున్నారు.

"ఈ నగరానికి ఏమైంది" అంటూ గతంలోనూ "నగరమా నరకమా" అంటూ ఇటీవల కాలంలోనూ 'లాయర్'తో పాటు అన్ని దినపత్రికల్లో సైతం మునిసిపల్ కార్పొరేషన్ నిర్లక్ష్యాన్ని, అవినీతిని, అక్రమాలని ఎండగడుతున్నా అటు కేంద్రంలోనూ ఇటు రాష్ట్రంలోనూ ఇద్దరు... పట్టణాభివృద్ధి శాఖ మంత్రులూ నెల్లూరోళ్లైనా ఈ వార్తలకు చీమ కుట్టినట్లైనా చలించకపోవడం అటు ప్రజలను ఇటు రాజకీయ మేధావులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇంత నిర్లక్ష్యానికి గురి కాబడుతున్న నెల్లూరు నగర ప్రజలు చేసుకున్న పాపమేమిటని అర్ధంకాక తలపట్టుకుంటున్నారు.

కేంద్రమంత్రి వెంకయ్యనాయుడికి నగరంపై అసలు ఆసక్తి లేదు. నెల్లూరు నెక్ట్స్ ద్వారా ఆయన చేసిన ప్రయత్నాలకు పెద్దగా స్పందన రాకపోవడంతో నగరాన్ని ఆయన గాలికి వదిలేశాడు. ముఖ్యంగా నెల్లూరు కార్పొరేషన్ ప్రక్షాళన విషయంలో తమకేమీ పట్టనట్లుగానే వెంకయ్య వ్యవహరించడం విడ్డూరమైన విషయం.

ఇక మరో మంత్రి నారాయణ ఆయన అత్తవారింటికి అల్లుడొచ్చినట్లు ఏ పండగకో పబ్బానికో వస్తాడు. రొట్టెల పండుగ, పెద్దల పండుగ లేదా ప్రభుత్వ పథకాల పండుగ అంటూ పండగ వేళల్లోనే కనపడతాడు. ఇక మధ్యలో ఎప్పుడో రాత్రివేళల్లో వచ్చి వెళ్తాడు.

నగరాభివృద్ధికి చెందిన ఇద్దరు మంత్రులూ నెల్లూరోళ్లే అయ్యుండి కూడా కనీసం కార్పొరేషన్‌కి ఒక నిఖార్సయిన ఐ.ఏ.ఎస్ అధికారిని కమిషనర్‌గా నియమించడానికి సంకోచిస్తున్నారంటే నగరం పట్ల వీరికున్న శ్రద్ధ, ఆసక్తి స్పష్టమైపోతోంది.

చివరికి నగరంలో దోమలు, పందులు వీరవిహారం చేస్తున్నాయి. నెల్లూరులో 5లక్షల మంది ప్రజలుంటే ఏ 5వేలకోట్లకు పైగానే దోమలుంటాయి. నగరంలోని ఏ ప్రాంతం చూసినా ముక్కులదరగొట్టే మురుగుతో మురికి గుంటలతో గబ్బుకొట్టిపోతోంది.

## సమర్ధత వున్నా... సహకారం లేదు

- ఎమ్మెల్యేలిద్దరూ డమ్మీలే

ఇక నెల్లూరు నగరంతో పాటు రూరల్‌లో సైతం వై.సి.పి ఎమ్మెల్యేలను గెలిపించుకోవడం ప్రజలకు పెద్ద శాపంగా మారినట్లే అనిపిస్తోంది. ఇద్దరు ఎమ్మెల్యేలూ యువకులు, ఉత్సాహవంతులు. ప్రజలకు ఏదో చేయాలన్న తపనతో పాటు సుదీర్ఘ రాజకీయ భవిష్యత్తుకు ప్రజాసేవే పరమావధిగా పనిచేయాలన్న ఆలోచన, దృక్పథం కలిగిన వాళ్లు. అయితే వాళ్లకు 'పవర్' లేదు, ఇద్దరూ ప్రతిపక్ష ఎమ్మెల్యేలే కావడంతో వాళ్ల ఆదేశాలు ఆలోచనలు ఆచరణలో సాధ్యం కావడం లేదు. అధికారులు వీళ్లనసలు లెఖ్ఖపెట్టడం

### మాకెందుకన్నట్లున్న మంత్రి ద్వయం





### పేరున్నా పవర్‌లేని ఎమ్మెల్యేలు





### పవరున్నా పవర్స్‌లేని యంత్రాంగం





లేదు. సాక్షాత్తూ ప్రధానమంత్రే ఆదేశించినా తమ స్టైల్‌లో సమాధానం చెప్పి పని ఎగ్గొట్టడంలో ఆరితేరిన నెల్లూరు నగర కార్పొరేషన్ సిబ్బంది ఈ ఇద్దరు ఎమ్మెల్యేలనూ అసలు ప్రజా ప్రతినిధులుగా చూస్తున్నట్లు కూడా లేదు.

అటు రూరల్ ఇటు నగరంలో సమస్యలను వీళ్ళ దృష్టికి తీసుకెళ్లినా ఆ సమస్యను పరిష్కరించడానికి ఇద్దరు ఎమ్మెల్యేలూ తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం మాత్రం సున్నానే! ఉదాహరణకు మాగుంట లే అవుట్ ఎస్.ఆర్.కె స్కూల్ నుండి సిపిఆర్ కళ్యాణ మండపం వరకూ మంజూరు కాబడిన డ్రైన్ నిర్మాణాన్ని తీసుకుంటే 15రోజుల క్రితం 'లాయర్'లో ఇక్కడ కాంట్రాక్టర్ అహంకార పోకడ అధికారుల్లో నిర్లక్ష్య వైఖరిని ఉటంకిస్తూ వార్త ప్రచురితమైంది. సదరు వార్తకు వెంటనే స్పందించిన రూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విషయాన్ని కొంచెం సీరియస్‌గానే తీసుకున్నాడు. వెంటనే మునిసిపల్ అధికారులతో మాట్లాడడంతో పాటు జాయింట్ కలెక్టర్‌ని కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లాడు. లాయర్‌లో వార్త వచ్చిన మూడురోజుల తర్వాత మళ్ళీ ఓ ప్రముఖ దినపత్రికలో సైతం ఈ డ్రైన్‌కి సంబంధించిన వార్త ప్రచురితమైంది. అప్పుడు కూడా శ్రీధర్‌రెడ్డి మళ్ళీ స్పందించి జె.సి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. కానీ ఫలితం శూన్యం. కార్పొరేషన్ అధికారులు సమస్య వున్న ప్రాంతాన్ని సందర్శించి తమదైన తరహాలో చూస్తాం... చేస్తాం... చించేస్తాం... పొడిచేస్తాం అంటూ వెళ్లిపోయారు. అంతా ఎక్కడ గొంగళి అక్కడే. కంకర, ఇసుకతో పాటు కాంట్రాక్టర్ తీసిన గొయ్యి, అందులో లక్షల్లో దోమలు, వందల్లో పందులు, బిక్కుబిక్కు మంటూ ఎస్.ఆర్.కె స్కూల్‌లో చదివే పిల్లల ప్రాణాలు. ఇది కేవలం ఓ ఉదాహరణ మాత్రమే.

## నగరమంతా పోస్టర్లు, ఫ్లెక్సీలు

ఎక్కడపడితే అక్కడ పోస్టర్లు, ఫ్లెక్సీలు వుండకూడదని, ఇష్టానుసారం పోస్టర్లు అంటించడం ఫ్లెక్సీలు కట్టడం వంటివి అనుమతించరాదని సాక్షాత్తూ సుప్రీంకోర్టే ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆ ఆదేశాలను సైతం ఖాతరుచేసే నాయకుడూ లేడు, నాథుడూ లేడు. ఇక నెల్లూరులో విగ్రహాలకు కొదవలేదు. ఆ విగ్రహాల ఐలాండ్లకు వేసే ప్రచార (మిగతా 11వ పేజీలో)

## 'ప్రభా'తం

# ఆర్థిక వ్యవస్థకు దన్ను.. ఏక పన్ను

'ఒకే దేశం-ఒకే పన్ను' విధానంతో త్వరలో అమలులోకి రానున్న జిఎస్‌టి విధానం ఆహ్వానించదగినదే. జిఎస్‌టి వల్ల దేశానికెంతో మేలు చేకూరుతుందని అందరూ భావిస్తున్నారు. దీంతో, వృద్ధిరేటు పెరిగి దేశానికి ప్రతిఏటా సుమారు లక్షకోట్ల దాకా ఆదాయం చేకూరుతుందని నిపుణుల అంచనా. అనేక దేశాలు ఇప్పటికే ఏకీకృత రేటు విధానంతో పన్ను పరిధిని, వసూళ్ల రాబడిని బాగా పెంచుకుంటున్న నేపథ్యంలో ఈ జిఎస్‌టి విధానం మనదేశానికి ఎంతో మేలు చేకూరుస్తుందని భావించవచ్చు.

భారత ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలో, కేంద్రప్రభుత్వం మనదేశ ఆర్థిక వ్యవస్థను అన్నివిధాలా బలోపేతం చేసేందుకు పలు నిర్ణయాలు తీసుకోబోతోంది. ఇప్పటికే కొన్ని నిర్ణయాలు అమలులోకి వచ్చివున్నాయి కూడా. ఇటీవల పెద్దనోట్ల రద్దు నిర్ణయం ఒక సంచలనం కాగా, దీని అమలులో కొన్ని కష్టాలు ఎదురైనప్పటికీ ఈ ఏడాది.. వచ్చే ఏడాది జీడీపి వృద్ధిరేటు తగ్గినా, భవిష్యత్తులో మాత్రం ఈ విధానం వల్ల ఎన్నో ప్రయోజనాలుంటాయని ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. బ్యాంకులలో డిపాజిట్లు బాగా పెరగడంతో పన్ను వసూళ్ళు కూడా బాగా పెరుగుతాయని, మరోవైపు నగదు రహిత లావాదేవీలతో ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుతుందని, ఆర్థికవ్యవస్థ బలంగా వుంటే దేశాభివృద్ధికి, అభివృద్ధి పథకాలకు నిధుల కొరత వుండదని భావిస్తున్నారు. సాహసోపేతమైన ఈ నిర్ణయాల వల్ల దేశపురోభివృద్ధికి ఇక ఆటంకం వుండబోదని ప్రధానితో పాటు అత్యధికశాతం ప్రజలూ విశ్వసిస్తున్నారు.

ఈ నేపథ్యంలో, 'ఒకే దేశం..ఒకే పన్ను' అనే సరికొత్త ఆర్థికవ్యవస్థకు మోదీ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. స్వతంత్ర భారత చరిత్రలో మన ఆర్థిక వ్యవస్థలో.. పన్నుల విధానంలో సంస్కరణలు తెస్తూ ఇంతటి బృహత్తరమైన నిర్ణయం తీసుకోవడం ఇదే ప్రథమం. దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానాన్ని ప్రారంభించేందుకు మోడీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సన్నాహాలు చేస్తూండడం ఒక శుభపరిణామం. ఈ క్రమంలో కేంద్రప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ అతిపెద్ద పరోక్ష పన్నుల సంస్కరణ.. జిఎస్‌టి అత్యంత త్వరలోనే.. అంటే జులై నుంచే అమలులోకి వచ్చేందుకు కృషి జరుగుతోంది. జిఎస్‌టి విధానం అన్నివిధాల మంచిదే.. అందరూ స్వాగతించ దగినదే. దీనిని అమలుచేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య గత కొద్దికాలంగా వున్న అవరోధాలు కూడా ఇక సమసిపోయినట్లే. సముద్ర వ్యాపారం విషయంలో పన్ను విధించే హక్కు కేంద్రానిదే అయినప్పటికీ రాష్ట్రాల డిమాండ్‌లను ఆమోదించడం జరిగింది. సరుకులు, సర్వీసులకు సంబంధించి అంతర్ రాష్ట్ర వాణిజ్యంపై సమీకృత జిఎస్‌టి వసూలు చేసే అధికారం కేంద్రప్రభుత్వానికే వుంటుంది. అయితే కొన్ని ప్రత్యేక చట్ట నిబంధనల ద్వారా ఆ హక్కును రాష్ట్రాలకు కూడా సంక్రమింపజేయడానికి నిర్ణయం తీసుకోవడంతో ఇంతకాలంగా జిఎస్‌టి అమలులో కేంద్ర-రాష్ట్రాల మధ్య వున్న ప్రతిష్టంభన తొలగిపోయినట్లేనని అనుకోవచ్చు. అంతేకాదు, నాలుగు రకాల శ్లాబ్‌లతో కూడిన జిఎస్‌టి పన్ను రేట్లకు ఇప్పటికే జిఎస్‌టి కౌన్సిల్ ఆమోదం లభించింది కూడా. ఒకటిన్నర కోట్ల రూపాయలలోపు వార్షిక టర్నోవర్ వున్న వ్యాపారుల్లో 90 శాతం మంది రాష్ట్రాల నియంత్రణలోకి, 10 శాతం మంది కేంద్రం పరిధిలోకి వచ్చేవిధంగా, ఒకటిన్నర కోట్ల రూపాయలకు పైబడిన టర్నోవర్ వున్న వ్యాపారసంస్థల్లో సగంమంది కేంద్ర పరిధిలో, మరో సగంమంది రాష్ట్ర పరిధిలో వుండేవిధంగా నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల ఢిల్లీలో ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ సారథ్యంలో జరిగిన వస్తుసేవల పన్నుల (జిఎస్‌టి) మండలి సమావేశంలో పన్నుల సంస్కరణకు సంబంధించి ఇలాంటి పలు చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. సముద్రతీరం నుంచి 12 నాటికల్ మైళ్ల లోపు సముద్రంలో జరిగే వ్యాపారంపై పన్ను విధించే హక్కు తీరప్రాంత రాష్ట్రాలకే వుండేవిధంగా, పన్ను విధింపుకు సంబంధించి సప్లయ్ జరిగిన ప్రదేశంపై రాష్ట్రాల మధ్య ఒకవేళ ఏమైనా పేచీలుంటే ఆయా కేసుల్లో మాత్రం కేంద్రమే పన్ను విధించే విధంగా నిర్ణయం తీసుకున్నారు. వచ్చేనెల 18న మరోసారి జరుగనున్న జిఎస్‌టి సమావేశంలో పూర్తిస్థాయి నిర్ణయాలు తీసుకోనున్నారు.

జులై 1వ తేదీ నుంచి ఈ ఏకరూప పన్ను విధానాన్ని అమలుచేసేందుకు కేంద్రప్రభుత్వం పెద్దకసరత్తే చేస్తోంది. వస్తువులు ఉత్పత్తి జరిగేచోటు నుంచి, అవి టోకు వర్తకుల వద్దకు, చిల్లర వర్తకుల వద్దకు చేరి..వినియోగదారుల చెంతకు చేరేదాకా వివిధ దశల్లో వున్న పన్నుల చక్రాన్ని సక్రమమైన గాడిలో పెట్టేందుకు, తద్వారా వినియోగదారునికి అన్నివిధాలా మేలైన పన్నుల విధానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు చేస్తున్న ఈ ప్రయత్నం సఫలీకృతమైతే, ఇప్పటిదాకా అస్తవ్యస్తంగా వున్న పన్నుల మీద పన్నుల వ్యవస్థ ఒక క్రమబద్ధమైన రీతిలోకి వస్తుందని అందరూ ఆశిస్తున్నారు. ఆ కలను సాకారం చేసే దిశగా మోడీ ప్రభుత్వం చేయాల్సిన కృషినంతా చేస్తోంది. ఎక్సైజ్ సుంకం, సేవా పన్నుతోసహా కేంద్ర స్థాయిలో ఎనిమిదిరకాల పన్నులు, ఎంట్రీ ట్యాక్స్‌తో సహా రాష్ట్రాల పరిధిలోని మరో 9 రకాల పన్నుల స్థానంలో జిఎస్‌టి ఆవిర్భవించి..'ఏక్ భారత్' అనే సర్వమైన.. భవ్యమైన దిశలో... ఒకే పన్ను విధానానికి మార్గం వేసినట్లవుతుందని భావిస్తున్నారు. ఆకాశా న్నంటిన ధరలు కూడా దీంతో నేలకి దిగివస్తాయని, దేశీయ ఉత్పత్తులకు బాగా డిమాండ్ ఏర్పడి విదేశీ ఉత్పత్తులకు దీటుగా నిలుస్తాయని, అంతర్జాతీయ మార్కెట్లలోనూ మన ఉత్పత్తులకు మంచి గిరాకీ ఏర్పడుతుందని ఆర్థికవేత్తలు అంచనాలు వేస్తున్నారు. జిఎస్‌టి వల్ల వృద్ధిరేటు పెరిగి దేశానికి ప్రతిఏటా సుమారు లక్షకోట్ల దాకా ఆదాయం చేకూరుతుందని కూడా నిపుణుల అంచనా.

అనేక దేశాలు ఇప్పటికే ఏకీకృత రేటు విధానంతో పన్ను పరిధిని, వసూళ్ళ రాబడిని బాగా పెంచుకుంటున్న నేపథ్యంలో జిఎస్‌టి విధానం మనదేశానికెంతో మేలు చేకూరుస్తుందని భావిస్తున్నారు. అయితే, దీని ఆచరణలో సవాలక్ష సమస్యలూ వున్నాయి. అన్నిటినీ అధిగమిస్తూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్థిక నిపుణులు అందరూ సమిష్టిగా, సమన్వయంతో కృషిచేస్తే.. జిఎస్‌టి అమలు సత్ఫలితాలనిస్తుందని వేరే చెప్పనక్కరలేదు. ఆర్థిక వ్యవస్థే దేశానికి వెన్నెముక కనుక, అది ఎంత పుష్టి కరంగా వుంటే దేశానికంత ఆరోగ్యం. ఏదేమైనా, త్వరలో రానున్న ఈ సరికొత్త జిఎస్‌టి విధానం పటిష్టవంతంగా అమలులోకి వచ్చి.. దేశాభ్యున్నతికి మెరుగైన దారులు వేస్తుందనే ఆశిద్దాం!..

# పిహెచ్‌సిని తనిఖీ చేసిన జేసీ



ఈ నెల 16న నెల్లూరుజిల్లా సంయుక్త కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ కోట గ్రామం మరియు కోట మండలం నందున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేషెంట్స్‌ను వారికి జరుగుతున్న చికిత్సల గురించి అడిగి తెలుసుకొని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న వైద్యాధికారి, సిబ్బందితో ఆరోగ్య కేంద్రం యొక్క పనితీరు గురించి తెలుసుకున్నారు.

# డిప్యూటిమేయర్ జన్మదిన వేడుకలు

నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. నెల్లూరు బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో అన్నదానం, దుప్పట్ల పంపిణీ చేపట్టారు. నవాబుపేటలోని కార్యాలయంలో ముక్కాల కేక్ కట్ చేశారు. 6వ డివిజన్ పరిధిలోని వాటర్ ప్లాంట్ వద్ద అభిమానులు భారీ కేక్ కట్ చేశారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ఆర్యవైశ్య సంఘీయులు, క్రీడాసంఘాలకు చెందిన పలువురు ఆయనకు అభినందలు తెలిపారు.






## బోసిపోతున్న పల్లెలు

ఈ కంప్యూటర్ యుగంలో మనుషులు బంధాలు, బంధుత్వాలు, మానవ సంబంధాలను మరచిపోతున్నారు. డబ్బు సంపాదనలో పడ్డ వారికి పుట్టి పెరిగిన ఊర్లు గుర్తుకు రావడం లేదు. ఇంతకుముందు సంక్రాంతికి, ఊర్లలో జరిగే తిరునాళ్ల కన్నా సొంతూర్లకు వచ్చేవాళ్లు, ఇప్పుడు నగరాలు, విదేశాలలో ఉద్యోగాల పేరుతో సెటిలైన వాళ్లు సంక్రాంతికి కూడా సొంతూర్లకు రావడం లేదు. డబ్బు వ్యామోహంలో పడి యాంత్రిక జీవనానికి అలవాటు పడి అసలైన ప్రేమానురాగాలను కోల్పోతున్నారు.

**జి.దినకర్‌రెడ్డి, నార్త్‌రాజుపాలెం.**

## భళా... శాతకర్ణి

తెలుగు రాజు విజయగాథను ఈతరం వారికి తెలియజేస్తూ తెరకెక్కించిన 'గౌతమిపుత్ర శాతకర్ణి' సినిమా చాలా బాగుంది. మన తెలుగు రాజు గొప్ప తనాన్ని, హైందవ ధర్మాన్ని పాటించేవారంతా ఒకే సామ్రాజ్యం క్రింద ఉండాలన్న ఆ రాజు ఔన్నత్యాన్ని నేటితరం వారు తెలుసుకోగలిగారు. దర్శకుడు క్రిష్ ఎంతో అద్భుతంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. శాత కర్ణిగా బాలకృష్ణ జీవించాడు. చారిత్రాత్మక పాత్రలో మరోసారి తన సత్తా చాటారు. ఇలాంటి చిత్రానికి వినోదపు పన్ను మినహాయించిన రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు అభినందనలు.

**కె.రవిచౌదరి, నెల్లూరు.**

## కోటలు దాటిన మాటలు

ఎన్ని శంకుస్థాపనలు, ఎన్ని పండుగలు, ఎన్ని పట్టిసీమలు, ఎన్ని పురుషోత్తమ పట్నాలు, ఎన్ని సుందరీకరణలు, ఎన్ని నగరీకరణలు... చంద్రబాబు శంకుస్థాపనలు చేయని రోజేది? మరీ మన ముఖ్యమంత్రి అలసట లేకుండా, నోరు నొప్పి లేకుండా చెప్పిందే చెబుతున్నాడు. బాబు చెప్పేవన్నీ సమకూరితే ఈ రాష్ట్రంలో ప్రజలు పనులు చేయడం మాని కూర్చుని తినొచ్చు. అంతెందుకు నెల్లూరులో 54డివిజన్‌లు, 7లక్షల జనాభా, 200 మురికివాడలు, కాలువలపై కాపురాలు, నికృష్ణ జీవనాలు... రెండున్నర సంవత్సరాలుగా ఏం అభివృద్ధి జరిగిందో చెప్పాలి. ఐలాండ్స్, ఇరుకురోడ్లు, మురికి గుంటలు అట్లానే వున్నాయి. చంద్రబాబు మాటలు కోటలు దాటుతున్నాయి. చేతలు మాత్రం పట్టు తప్పుతున్నాయి.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

# అయ్యప్ప దేవస్థానంలో మకరజ్యోతి

సంక్రాంతిని పురస్కరించుకుని నెల్లూరు వేదాయపాలెంలోని స్వామి అయ్యప్ప దేవస్థానంలో శబరిమల సంప్రదాయానుసారం 14వతేదీ మకరజ్యోతిని వెలిగించారు. కర్పూరజ్యోతిని భక్తజనం కనులారా తిలకించి పులకించిపోయారు. అనంతరం ఆలయంలో కొలువైన అయ్యప్పస్వామికి అఖండ హారతి ఇచ్చారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. కేరళ సంప్రదాయ రీతిలో ఆలయ ప్రధానార్చకుడు మేల్‌శాంతి సుబ్రహ్మణ్యంశర్మ ఆధ్వర్యంలో దీపారాధన, విశేషపూజలను నిర్వహించారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, సూళ్ళూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానం పాలకమండలి ఛైర్మెన్ ముప్పాళ్ళ వెంకటేశ్వర్లురెడ్డి, డిఆర్ ఉత్తమ హోటల్ అధినేత ధనుంజయరెడ్డి, టిడిపి నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి తదితరులు స్వామివారి దర్శించుకున్నారు. స్వామి అయ్యప్ప సేవాసమాజ అధ్యక్షుడు పి.టి.రంగరాజన్, ఉపాధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం తదితరులు పర్యవేక్షించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

# పడకేసిన పారిశ్రామిక ప్రగతి

## • కొత్త ప్రభుత్వంలో కొత్త పరిశ్రమలేవి?

**కృష్ణపట్నం పోర్టు... మేనకూరు సెజ్... అపాచీ షూ ఫ్యాక్టరీ... శ్రీసిటీ... యంబిక్యూ స్టీల్స్... మాస్‌హోల్డింగ్ గార్మెంట్స్... ఈ సెల్‌లలో ఎన్నో పరిశ్రమలు... వేలమందికి ఉద్యోగాలు... పెరిగిన భూముల విలువలు... కోట్లకు చేరిన రైతుల ఆస్తులు... ఆదాయాల్లో వ్యాపారాలు... దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి ఐదేళ్ల పాలనలో జిల్లాలో చోటుచేసుకున్న ప్రగతి కేంద్రాలు. ఆవిష్కరణకు నోచుకున్న అభివృద్ధి మార్గాలు.**



నెల్లూరుజిల్లాలో భూమికి విలువ పెరిగినా, సెజ్‌లు ఏర్పడి పదిమందికి ఉద్యోగాలు వచ్చినా, వ్యాపారాలు వృద్ధి చెందినా, రైతులు సంతోషంగా వున్నా అది వై.యస్. పాలనాకాలం పుణ్యమే! వై.యస్. కాలం నాటి ఊపుతోనే పారిశ్రామిక ప్రగతి జరిగి వుంటే నెల్లూరుజిల్లా ఇప్పటికే ఒక నోయిడా, ఒక గుర్‌గావ్ మాదిరిగా తయారై ఉండేది. వై.యస్. మరణం తర్వాత ఐదేళ్ళ రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి పాలనలో పారిశ్రామిక ప్రగతి మందగించింది. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లాలో పారిశ్రామిక ప్రగతి పూర్తిగా ముసుగుతన్ని పడుకుంది.

రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా పరిశ్రమలంటూ లేకుండాపోయాయి. దగదర్తి వద్ద బిఎంఆర్ కట్టిన ఫ్యాక్టరీ, ఇఫ్కో సెజ్‌లో గమేషా పరిశ్రమ మాత్రమే వచ్చాయి. దేశంలోనే అత్యున్నతమైన సెజ్‌గా రూపొందించిన శ్రీసిటీ సెజ్‌లో కూడా కేవలం యాజమాన్యం శ్రద్ధ, ఆసక్తి మూలంగానే ఒకటి అరా పరిశ్రమలు వస్తున్నాయి. జిల్లా పారిశ్రామిక చరిత్రనే మార్చిన కృష్ణపట్నం పోర్టు సెజ్‌లోకి కొత్తగా ఒక్క పరిశ్రమ వచ్చిన దాఖలాలు లేవు. క్రిబ్‌కో ఎరువుల ఫ్యాక్టరీ మంజూరైనా ఇంతవరకు శంకుస్థాపన జరగలేదు. జెన్‌కో, సెంబ్‌కార్ప్ పవర్ ప్రాజెక్టులు రన్నింగ్‌లో ఉన్నాయి. సింహపురి థర్మల్ కేంద్రం, ఎంబిక్యూ స్టీల్స్‌ను మూసివేశారు. కృష్ణపట్నం పోర్టులో మొత్తం 42బెర్తుల నిర్మాణం జరగాలి. ఇప్పటికే పది పూర్తయ్యాయి. అయితే ఇటీవలకాలంలో ఆ పది బెర్త్‌లకే బిజినెస్ లేదు. ముఖ్యంగా బళ్లారి నుండి ఐరన్‌ఓర్ ఎగుమతి ఆగిపోవడం పోర్టు వాణిజ్యంలో పెద్ద కుదుపు! పవర్ ప్రాజెక్టులు ఉండబట్టి బొగ్గుల నౌకలు వస్తున్నాయి. యూరియా, చక్కెర వంటివి దిగుమతి చేసుకుంటుండబట్టి కొంత వ్యాపారం జరుగుతోంది. కొత్త పరిశ్రమలు ఏర్పాటు కాకపోతుండడమే పారిశ్రామిక ప్రగతికి ప్రతిబంధకంగా మారుతోంది. ఈ మూడేళ్లలో జిల్లాలో చెప్పుకోదగ్గ పరిశ్రమ ఒక్కటీ ఏర్పాటు కాలేదు. కొత్తగా ఉపాధి అవకాశాలు లేవు. పరిశ్రమలు లేకపోవడం వల్లే రియల్ ఎస్టేట్‌తో పాటు ఇతర వ్యాపారాలలో ఒడిదుడుకులు మొదలయ్యాయి.

## నెల్లూరు 'హృదయ'రాజుకు

# యూరోపియన్ సొసైటీ ప్రతిష్టాత్మక పురస్కారం




వేలాదిమందికి గుండె ఆపరేషన్లు, లక్షలాదిమందికి గుండె పరీక్షలతో అనునిత్యం వారి గుండెల్లో మెదిలే కిమ్స్(బొల్లినేని) ఆసుపత్రి చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ చేజర్ల శేషశ్రీనివాసరాజు మరో అత్యున్నత పురస్కారాన్ని అందుకున్నారు. యూరోపియన్ సొసైటి ఆఫ్ కార్డియాలజీ ఆయనకు ఇంటర్నేషనల్ ఫెలోషిప్‌ను అందజేసింది. ఈనెల 15వ తేదీన ముంబైలో జరిగిన సొసైటి 4వ వార్షిక సదస్సులో సొసైటీ అధ్యక్షులు ప్రొఫెసర్ జెరోన్‌బాక్స్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. గుండెవ్యాధుల వైద్య చికిత్సలో శ్రీనివాసరాజు చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది.

అత్యున్నత పురస్కారాన్ని అందుకుని, నెల్లూరు జిల్లా వైద్య రంగానికి వన్నె తెచ్చిన డాక్టర్ సి.ఎస్.రాజుకు 'లాయర్' అభినందనలు.

# బంధాలు, అనుబంధాల దృశ్యమాలిక

## • శతమానం భవతి సినిమాకు కోటంరెడ్డి మెచ్చుకోలు



బంధాలు, అనుబంధాలు, కుటుంబ ఆత్మీయతలు, మానవ సంబంధాలు కనుమరుగవుతున్న ఈరోజుల్లో వాటి విలువని, అవసరాన్ని, పండుగ దినాల ప్రాముఖ్యతని వివరిస్తూ తీసిన సినిమా 'శతమానం భవతి' అని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. 16వ తేదీ నెల్లూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాఫ్ట్‌వేర్ యుగం అంటూ చంకలు గుద్దుకుంటూ మానవ సంబంధాలన్నీ హార్డ్‌వేర్‌గా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో మానవ సంబంధాలు, కుటుంబ ఆత్మీయతలు, ఫేస్‌బుక్కుల్లో, వాట్సప్‌లలో కాకుండా కుటుంబాల్లో ఎంత చక్కగా ఉంటాయో వివరించిన సినిమా శతమానంభవతి. ప్రతి ఒక్కరూ చూడాల్సిన సినిమా శతమానంభవతి. కులాలకి, మతాలకి, ప్రాంతాలకి, రాజకీయ పార్టీలకు అతీతంగా, నేటి సమాజానికి అత్యంత అవసరమైన సినిమా ఇది.

ఒక వ్యక్తిగా ఈ సినిమా చూసి ప్రభావితమై, అందరినీ చూడమని నేను కోరుతున్నాను. ఒక ఎమ్మెల్యేగా ఈ చిత్రాన్ని సామాజిక చిత్రంగా గుర్తించి, వినోద పన్ను రాయితీ కల్పించి, ప్రజలందరూ చూసే అవకాశం కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాను. మరీ ముఖ్యంగా స్కూళ్లలో, కళాశాలల్లో ఈ చిత్రాన్ని విద్యార్థినీ విద్యార్థులు చూసే విధంగా ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చెయ్యాలని కోరుతున్నానన్నారు. కార్యక్రమంలో వైయస్సార్సీపీ కార్పొరేషన్ విప్ బొబ్బల శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యం

## - వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ గొబ్బెమ్మల సంబరాల్లో మంత్రి నారాయణ



రాష్ట్రంలో మహిళలను ఆర్థికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డా॥ పొంగూరు నారాయణ అన్నారు. సోమవారం నెల్లూరు విఆర్ కళాశాల మైదానంలో వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి గొబ్బెమ్మల పండుగ సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 87లక్షల మంది డ్వాక్రా మహిళలు ఉన్నారని, వీరి తలసరి ఆదాయం రూ.35వేలని, ఆ మొత్తాన్ని 2022 నాటికి రూ.1.10లక్షలు చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. మన సంప్రదాయాలను గౌరవించేలా ప్రభుత్వం సంక్రాంతి వేడుకలకు జిల్లాకు ఒక కోటి రూపాయలు కేటాయించిందన్నారు. వసంత లక్ష్మి సేవలు అభినందనీయమన్నారు. నగర మేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ కులమతా లకు అతీతంగా పండుగలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. రంజాన్, క్రిస్మస్, సంక్రాంతికి చౌకదుకాణాల ద్వారా కానుకలు అందజేస్తూ పేదలకు అండగా ఉంటోందన్నారు. మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి మాట్లాడుతూ ధనుర్మాసం ప్రారంభం నుంచే గొబ్బెమ్మల పండుగ గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తే సంక్రాంతి గొప్పతనమేమిటో తెలుస్తుందన్నారు. ట్రస్ట్ నిర్వాహకురాలు డా॥ వసంత లక్ష్మి మాట్లాడుతూ గొబ్బెమ్మల పండుగను ఏటా ఘనంగా నిర్వహిస్తామన్నారు. మహిళల స్వయం ఉపాధికి అన్ని విధాలా సహకరిస్తామన్నారు. ఈ సందర్భంగా మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలు, గోరింటాకు పోటీలు, గొబ్బెమ్మ పాటల పోటీల విజేతలకు మంత్రి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కోలాటం, పిల్లల నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, కార్పొరేటర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# పల్లెల్లో కళకళ... పట్టణాలు వెలవెల!

**ప్రతి ఊర్లో 'శతమానం భవతి' సన్నివేశాలే!**

పల్లెసీమలు... పాత తరాలవారు తప్పితే కొత్త జనరేషన్ అక్కడ ఉండడం లేదు. పొలాల మీద ప్రేమ వున్నోళ్ళు, పశువుల మీద మమకారం చావని వాళ్ళు మాత్రమే అక్కడ ఉంటున్నారు. ఈ జనరేషన్‌లో ఒంటికి చదువు అబ్బని వాళ్ళు ఆ పల్లెల్లో స్థిరపడిపోతున్నారు. అంతేగాని చదువు వంటబట్టి, చిన్నదో పెద్దదో ఉద్యోగం తెచ్చుకున్న వాళ్లెవరూ పల్లెటూర్లలో ఉండడం లేదు. ప్రతి గ్రామంలోనూ వృద్ధులు, వారి బిడ్డలు మాత్రమే వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మనవళ్ళు, మనుమరాళ్లు మాత్రం సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూనో, ఇతర ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటూనో విదేశాలు, నగరాలు, పట్టణాలలో ఉంటున్నారు. ఏడాది పొడవునా వ్యాపారాలు, ఉద్యోగాలలో బిజీగా వుంటూ, ఆధునిక పోకడల మోజులో పడి పల్లెటూరు మట్టివాసనను మరచిపోతుంటారు. ఏడాది పొడవునా నగరం నీడలో గడిపిన నేటి తరం వాళ్లను మూడురోజులు మాత్రం పల్లెలు అక్కున చేర్చుకుంటాయి. గుండెలకు హత్తుకుంటాయి. వారి పొలాలను, పొలాల్లో పైర్లను, వాటిలోని పరిమళాలను చూపిస్తాయి. పట్టణాలు, గ్రామాలలో 362రోజులు పడ్డ కష్టాన్ని ప్రజలు పల్లె సీమల్లో అడుగుపెట్టిన ఈ మూడురోజుల్లోనే మరచిపోతారు.

ప్రతి ఏడాది పల్లెలకు పట్టణాల కళ వచ్చేది సంక్రాంతి పండుగ మూడురోజులే! ఎంతటి దూరభార ప్రాంతాల్లో ఉన్నోళ్లయినా సంక్రాంతికి తమ ఊర్లకు పోవడానికి ఇష్టపడతారు. విదేశాలలో వున్నోళ్లు సైతం రెక్కలు కట్టుకుని సంక్రాంతికి తమ ఊర్లలో వాలుతారు. జిల్లాలోని అన్ని గ్రామాలు ఈ సంక్రాంతి పండుగ మూడురోజులు కళ కళలాడాయి. అమెరికా, ఇంగ్లాండ్, గల్ఫ్ దేశాలతో పాటు ముంబై, బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలలో వున్న జిల్లా వాసులందరూ సంక్రాంతికి తమ ఊర్లకు పరుగెత్తారు. ఈ మూడురోజులు తల్లిదండ్రులు, బంధుమిత్రులతో సరదాగా గడిపారు. చిన్ననాడు చదివిన స్కూళ్లు, మొక్కిన గుళ్లకు వెళ్లారు. ఈత కొట్టిన చెరువును, తాత కొట్టిన దెబ్బలను గుర్తు చేసుకున్నారు. ఎడ్ల పందేలు, కోళ్ల పందేలను తిలకించారు. భోగి మంటలు వేసుకున్నారు. హరిదాసు, బుడబొక్కల వేషాలను ఆస్వాదించారు. ఊరేగింపులో వచ్చిన దేవుడికి మొక్కుకున్నారు. ఎలిమెంటరీ స్కూల్‌లో, హైస్కూల్‌లో చదువుకున్న స్నేహితులను కలుసుకున్నారు. ఈ మూడురోజులు నగరాలు, పట్టణాల నుండి బస్సులు, కార్లన్నీ పల్లెలవైపే పరుగులు తీసాయి. సంక్రాంతి పండుగలో పల్లెసీమలు కళకళలాడితే పట్టణాలు కళతప్పాయి.

# నెల్లూరు కబుర్లు



## నెల్లూరుకు క్రీడాకాంతులు



నెల్లూరు నగరం క్రీడా సొగసులద్దుకుంది. ఈ నెల 19 నుండి 23వరకు ఏ.సి స్టేడియంలో ఖేలో ఇండియా క్రీడా పోటీలు జరుగనున్నాయి. అండర్-14 విభాగంలో ఖోఖో, కబడ్డీ, ఉషా పోటీలు జరుగుతాయి. ఈ పోటీలలో పాల్గొనడానికి 20 రాష్ట్రాల నుండి 750మంది ఆటగాళ్లు, వారి కోచ్‌లు, మేనేజర్లు వచ్చారు. వచ్చిన వాళ్లంతా 17, 18తేదీలలో నెల్లూరు నగరంలో పర్యటించారు. షాపింగ్ చేశారు. వివిధ ప్రాంతాలను సందర్శించారు. హోటళ్లకు వెళ్లి నెల్లూరు రుచులను ఆస్వాదించారు. వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారులను నెల్లూరీయులు ఎంతో అభిమానంగా చూస్తున్నారు. క్రీడాకారులకు ఘనస్వాగతం పలుకుతూ సివిఆర్ ఫౌండేషన్, అక్షర విద్యాలయం, కనుమూరు హరిశ్చంద్రారెడ్డి ఛారిటబుల్‌ట్రస్ట్ తదితర సంస్థలు ఏసి స్టేడియం వద్ద భారీ ఎత్తున ఫ్లెక్సీలు కట్టాయి.

## 28న జగన్నాథ రథయాత్ర



నెల్లూరులో ఈ నెల 28వతేదీన 6వ జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ నెల్లూరు అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవస్వామి తెలిపారు. ఇస్కాన్ సిటీలోని ఇస్కాన్ మందిరంలో రథయాత్ర పోస్టర్లు, ఆహ్వానపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఈ రథయాత్ర నెల్లూరు హరనాథపురం సెంటర్ నుండి ప్రారంభమై లీలామహల్ సెంటర్, చిన్నబజార్, సంతపేట, ఏసి సెంటర్, గాంధీబొమ్మ సెంటర్ మీదుగా కస్తూరిదేవి గార్డెన్స్ చేరుకుంటుందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఇస్కాన్ మందిరాల నుంచి దాదాపు 500 మంది ప్రతినిధులు హాజరై ఆధ్యాత్మిక ప్రవచనాలు చేయనున్నారని తెలిపారు. ముగింపు సందర్భంగా కస్తూరిదేవి గార్డెన్స్‌లో రాత్రి 9గంటలకు మహాహారతి, చప్పన్‌భోగ్, భోజనప్రసాద వితరణ జరుగుతుందన్నారు. ముఖ్యదాతలకు సత్కారం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఇస్కాన్ మందిర మేనేజర్ రాజశేఖర్‌దాస్, రథయాత్ర కమిటి సభ్యులు డివియస్ గిరి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## ఎస్సీ సబ్‌ప్లాన్ పనులు ప్రారంభించాలి

**- వైయస్సార్‌సీపీ ఫ్లోర్‌లీడర్ రూప్‌కుమార్‌యాదవ్**



ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో పనులు ప్రారంభించకపోతే నెల్లూరు కార్పొరేషన్ ఎదుట ధర్నాకు దిగుతామని వైయస్సార్‌సీపీ ఫ్లోర్‌లీడర్ రూప్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి నారాయణ సొంత జిల్లాలోని కార్పొరేషన్‌లో రెగ్యులర్ కమిషనర్‌ను నియమించుకోలేక ఇతర శాఖల నుంచి అధికారులను వేసి పాలన సాగించడం సిగ్గుచేటన్నారు. పాలన చేతకాకపోతే మంత్రి, మేయర్ తప్పుకోవాలన్నారు. మంత్రి కార్పొరేషన్ పరిధిలో కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 2015 ఆగస్టు 12వ తేదీన ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరైతే ఇంకా పనులు ప్రారంభించకపోవడం దారుణమన్నారు.

ఈ సమావేశంలో వైయస్సార్‌సీపీ కార్పొరేషన్ విప్ బొబ్బల శ్రీనివాసులు యాదవ్, కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, దామవరపు రాజశేఖర్, గోగుల నాగరాజు, ఎండి ఖలీల్ అహ్మద్, దేవరకొండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబరాలు జరుపుకున్న...



## కలెక్టర్ దంపతులు

నెల్లూరులోని జిల్లా కలెక్టర్ బంగ్లాలో కలెక్టర్ రేవు ముత్యాలరాజు, సింధూర దంపతులు సంక్రాంతి వేడుకలను జరుపుకున్నారు. బంగ్లా ప్రాంగణాన్ని ముగ్గులతో అలంకరించారు. శ్రీమతి సింధూర స్వయంగా పొంగలి వండి పూజలు నిర్వహించారు. గంగిరెద్దు విన్యాసాలు, హరిదాసు కీర్తనలు ఏర్పాటు చేసి తిలకించారు. కలెక్టర్‌గా ముత్యాలరాజు నెల్లూరులో జరుపుకున్న తొలి సంక్రాంతి పండుగ ఇది.

## పేదల ఆరోగ్యానికి రక్ష





ఆరోగ్యరక్ష వాల్ పోస్టర్‌ను ఈ నెల 17వ తేదీన జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి ఈ కార్డు రక్షణనిస్తుందని, రేషన్ కార్డు లేని వారు కూడా ఈ పథకంలో చేరి 1200 రూపాయలు ప్రీమియంతో 2లక్షల రూపాయల వరకు వ్యక్తి గత ఆరోగ్య బీమా పొందవచ్చునన్నారు. ఈ పథకంలో చేరాలనుకున్న వాళ్లు ఫిబ్రవరి 28వ తేదీలోగా మీ సేవ కేంద్రాలలో 1200 చెల్లించి అక్కడే బీమా కార్డులు పొందవచ్చునన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ఇదొక వరంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసేవల జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ దయాకర్, ఆఫీస్ అసోసియేట్ చంద్రమౌళి, మీ సేవ జిల్లా కో-ఆర్డినేటర్ షేక్ సలీం, మీ సేవ ఈ జిల్లా మేనేజర్ శ్రీరాములు పాల్గొన్నారు.

## మోహన్‌కు మండింది

నెల్లూరులోని ఏసి స్టేడియం వద్ద వున్న చెట్లను నిలువునా నరకడం చూసి శాప్ ఛైర్మెన్ పి.ఆర్.మోహన్‌కు ఒళ్లు మండింది. ఖేల్ ఇండియా జాతీయ క్రీడా పోటీల పర్యవేక్షణ కోసం నెల్లూరులోనే వుంటున్న ఆయన ఏ.సి స్టేడియం వద్ద వున్న చెట్లను నరికి దుంగలు ఎత్తుకుపోవడం చూసారు. పచ్చని చెట్లను నరకడానికి వీరికి ఎవరు అనుమతినిచ్చారో కనుక్కోండి, చెట్లను నరికిన వాళ్లపై కేసులు పెట్టండంటూ డిఎస్‌డిఓ రమణయ్యను ఆదేశించారు.

## ఇన్‌ఛార్జ్ ఆర్టీవోగా కిషోర్

నెల్లూరు ఇన్‌ఛార్జ్ ఆర్టీఓగా బిఎస్‌కె కిషోర్‌ను నియమిస్తూ రవాణాశాఖ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం ఉత్తర్వులు జారీ చేశారు. కిషోర్ పరిపాలనాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆర్టీఓ పూర్ణచంద్రరావుపై ఏసిబి అధికారులు దాడి చేయడం, ఆయన సస్పెండ్‌లో ఉండడం తెలిసిందే! అప్పటి నుండి ఆర్టీఓగా ఎవరినీ నియమించలేదు. ఇన్‌ఛార్జ్ ఆర్టీవోగా సీతారామిరెడ్డిని నియమించారు. ఇప్పుడు ఆయనను ఎంవిఐగానే కొనసాగిస్తూ కిషోర్‌ను ఇన్‌ఛార్జ్ ఆర్టీఓగా పెట్టగా ఆయన 17వ తేదీ బాధ్యతలు చేపట్టారు.

## యాచకులకు దుప్పట్లు

ఆదివారం నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం వద్ద వున్న యాచకులకు విశ్వహిందూ పరిషత్ వాళ్ళు దుప్పట్లు పంపిణీ చేసారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిడతల రమేష్, దేవస్థానం ఛైర్మెన్ మంచికంటి సుధాకర్‌రావు, విహెచ్‌పి రాష్ట్ర కార్యదర్శి మెంటా రామ్మోహన్‌రావు, వివిఆర్ మోహన్‌రావు, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాజసింహ ఆర్ట్ గ్యాలరీ ప్రారంభం



కవులు, చిత్రకారులను సన్మానిస్తున్న రాజసింహ సతీమణి కస్తూరమ్మ

చిత్రకళారంగంలో నెల్లూరుసీమకు అద్వితీయమైన ఖ్యాతిని తెచ్చిన ప్రఖ్యాత చిత్రకారుడు దివంగత ఆరంబాక్కం రాజసింహ పేరును మరింత చిరస్థాయి చేస్తూ ఆయన కుమారులు తమ తండ్రిగారి పేరుతో సంక్రాంతి పర్వదినాన 'రాజసింహ ఆర్ట్ గ్యాలరీ'ని ఏర్పాటు చేశారు. తంజావూరు చిత్రకారునిగా జాతీయస్థాయిలో ప్రసిద్ధి చెందిన రాజసింహ కుంచె నుంచి జాలువారిన అనేక అద్భుతమైన చిత్రాలతో ఈ గ్యాలరీని అందరినీ ఆకట్టుకునే విధంగా రూపొందించారు. శ్రీ వేంకటేశ్వరస్వామిపై అనన్యభక్తితో ఆయన వేసిన చిత్రాలు, తంజావూరు శైలిలో చిత్రించిన పలు దేవతామూర్తుల చిత్రాలు ఈ గ్యాలరీలో ప్రత్యేకత సంతరించుకున్నాయి. నెల్లూరులోని మూలాపేట శివాలయం వెనుక వీధిలో వున్న రాజసింహ స్వగృహంలోనే ఈ గ్యాలరీని ఏర్పాటుచేసి, తమ తల్లిగారైన కస్తూరిచే ప్రారంభోత్సవం చేయించారు. రాజసింహ కుమారులు కృష్ణసింహ, వేణుగోపాల్, చంద్రశేఖర్, మనుమడు సింహతేజ కలసి నిర్వహించిన ఈ ఆర్ట్‌గ్యాలరీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అనేకమంది చిత్రకారులు, కళాకారులు, రాజసింహ అభిమానులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రముఖ చిత్రకారులు అమీర్‌జాన్, ప్రముఖ కవి పెరుగు రామకృష్ణ, ప్రముఖ రంగస్థల కళాకారుడు తిరుపతి హరగోపాల్, 'లాయర్' వారపత్రిక సబ్‌ఎడిటర్ మద్దూరు శ్రీనివాసులు, పొత్రికేయులు సుందరం, కృష్ణయ్య తదితరులకు రాజసింహ సతీమణి కస్తూరమ్మ జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం కస్తూరమ్మ మాట్లాడుతూ, జిల్లాలోని చిత్రకారులకు ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం ఒక ఆర్ట్ గ్యాలరీని నెలకొల్పి చిత్రకళకు ప్రోత్సాహం ఇవ్వాలని, నిరుపేద చిత్రకారులకు ఇళ్ళస్థలాలు మంజూరుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు అక్కల శ్రీరామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యువజన నేతలపై వేటు

ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి ఫిరోజ్‌ఖాన్‌పై భౌతిక దాడికి పాల్పడడంతో నెల్లూరుజిల్లా, నగర అధ్యక్షులు కేశవనారాయణ, ముమిత్‌షాపై అధిష్టానం వేటు వేసింది. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేకహోదాపై చేపట్టిన ప్రజాబ్యాలెట్ కార్యక్రమ పరిశీలనకు గత నెల 31న నెల్లూరు వచ్చిన ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి ఫిరోజ్‌ఖాన్ నెల్లూరులోని ఓ హోటల్లో బస చేశారు. ఈ క్రమంలో జిల్లా, నగర అధ్యక్షులు కేశవనారాయణ, ముమిత్‌షా తమకు సమాచారం ఇవ్వకుండా ఏ విధంగా వస్తారని ఫిరోజ్‌ఖాన్‌తో గొడవకు దిగారు. తమ అనుచరులతో భౌతిక దాడికి దిగారు. దీంతో ఫిరోజ్‌ఖాన్ తనపై జరిగిన దాడిని అధిష్టానానికి వివరించగా ఇటీవల కేశవనారాయణ, ముమిత్‌షాకు షోకాజ్‌నోటీసులు జారీ చేశారు. వారు ఇచ్చిన సమాధానంపై సంతృప్తి చెందని అధిష్టానం వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.




# నత్తతో పోటీ పడుతున్న నెల్లూరు బ్యారేజీలు

- మాటల్లో చిరుతలా... చేతల్లో ఉడతలా ఉంటున్న మంత్రి పనితీరు
- బ్యారేజీలు పూర్తవుతాయని మంత్రిగారు చెప్పింది ఏ ఏడాది మార్చో!

మార్చికల్లా నెల్లూరు, సంగం బ్యారేజీలను పూర్తి చేసి నీళ్లిస్తామని కొన్ని నెలల క్రిందట జిల్లా మంత్రి పి.నారాయణ చెప్పారు. ఆయన మంత్రయ్యాక ఒకటికి నాలుగుసార్లు ఈ బ్యారేజీల నిర్మాణాన్ని పరిశీలించారు. నెల్లూరు బ్యారేజి పనులను చీకట్లో చూడ్డానికి వెళ్లినప్పుడే ఎమ్మెల్సీ బీద రవిచంద్ర కాలుజారి గాయపడ్డాడు. పోయినసారి తనిఖీలప్పుడే మార్చికల్లా ఈ బ్యారేజీల నిర్మాణం పూర్తవుతుందని, బ్యారేజీల మీద బండ్లు కూడా పోవచ్చని చెప్పారు. ఇప్పుడు జనవరి నెల. ఇంకో పదిరోజులు దాటితే ఫిబ్రవరి కూడా వస్తుంది. మరి మార్చికి ఎలా ఇవి పూర్తవుతాయో తెలియడం లేదు. మంత్రి మాటల్లో ఉన్నంత ఊపు చేతల్లో ఉండడం లేదు. ఇప్పటికే ఈ బ్యారేజీల నిర్మాణానికి 170కోట్ల దాకా ఖర్చయ్యింది. ఇంకో 120కోట్ల దాకా ఖర్చుందని అంచనా! గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటనకు వచ్చి ఈ బ్యారేజీలను పరిశీలించి, వీటిని తొందరగా పూర్తి చేయాలని, లేకుంటే బ్లాక్‌లిస్టులో పెడతామని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. కాంట్రాక్టర్లు తమ సమస్యలను చెబితే... వాటిని పరిష్కరిస్తానని కూడా ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఇటీవల ఈ పనులకు సంబంధించి కొన్ని బిల్లులు కూడా మంజూరు చేశారు. అయితే సీఎం గాని, మంత్రి గాని ఈ బ్యారేజీలపై మాటల్లో చూపించినంత శ్రద్ధ చేతల్లో చూపడం లేదు. గట్టిగా ఇంకో మూడు నెలలు పనిచేస్తే నెల్లూరు బ్యారేజి, అయిదారు నెలలు పనిచేస్తే సంగం బ్యారేజీ పూర్తవుతాయి. ఈ రెండు బ్యారేజీల ఖర్చు కూడా భారీఎత్తున లేదు. మంత్రి చొరవ తీసుకుంటే మార్చికి కాకున్నా 2017 ఏడాది పోకముందే వీటిని పూర్తి చేసుకుని ప్రారంభించుకోవచ్చు.

## క్రీడా స్ఫూర్తికి ప్రభుత్వం చేయూత

- ఎమ్మెల్సీ సోమిరెడ్డి



క్రీడా స్ఫూర్తికి తెలుగుదేశం ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈనెల 14న నెల్లూరు జిల్లా టిపి గూడూరు మండలం పాపిరెడ్డిపాళెం గ్రామంలో స్వర్గీయ ఆల్తూరి సురేంద్రరెడ్డి జ్ఞాపకార్థం ఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఆల్తూరి గిరీష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆల్తూరి కుటుంబం ప్రతి ఏడాది సంక్రాంతి వేడుకల సందర్భంగా గ్రామానికి ప్రత్యేక కళను తేవడాన్ని అభినందించారు. స్వగ్రామం జన్మనిచ్చిన తల్లితో సమానమని, ఎంత ఎత్తు ఎదిగినా జన్మభూమిని వదలకుండా అదేబాటలో నడుస్తున్నారన్నారు. ఆల్తూరి ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలో క్రీడా ప్రాంగణంకు అవసరమైన వనరులను సమకూర్చేందుకు తమ కుటుంబం ముందుంటుందన్నారు. ఎమ్మెల్సీ సోమిరెడ్డి తమ గ్రామానికి కావాల్సిన మౌలిక వసతులు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు బొమ్మి సురేంద్ర, సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోదూరు శ్రీనివాసులురెడ్డి, దువ్వూరు వెంకటకృష్ణారెడ్డి, మారంరెడ్డి గోపాల్‌రెడ్డి, శరత్‌చంద్ర, శ్యామ్‌సుందర్ రెడ్డి, ఆర్గనైజర్లు తిరువళ్ళూరు ఈశ్వరయ్య, వెంకటసుబ్బయ్య, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



## పదవులు కాదు.. పని ముఖ్యం!

అధికారంలో ఉన్నా, లేకున్నా నిరంతరం సమస్యల పరిష్కారానికి పనిచేసేవారినే ప్రజలు ఆదరిస్తారని, తమ సోదరుడు ఆనం రామనారాయణరెడ్డి అధికారంలో లేకున్నా ముఖ్యమంత్రి, మంత్రి సహకారంతో నియోజకవర్గంలో అభివృద్ధికి కృషి చేస్తున్నారని, దీన్ని జీర్ణించుకోలేక ఎంపి రాజమోహన్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డిలు విమర్శిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నాయకులు ఆనం వివేకానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం నెల్లూరు ఏసి సెంటర్‌లోని తన కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు ఆత్మకూరులో పనులు ప్రారంభిస్తామని, ఆయా పనుల ప్రారంభోత్సవం, శిలాఫలకాలపై ఎక్కడా ప్రోటోకాల్ ఉల్లంఘన జరగలేదన్నారు. ఆ కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలకు ఆహ్వానం పంపారని, కానీ వారు హాజరుకాలేదన్నారు. ప్రోటోకాల్ విషయంలో ఎక్కడైనా పొరపాటు జరిగివుంటే ముఖ్యమంత్రి, మంత్రి, అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని, తమకెలాంటి అభ్యంతరం లేదన్నారు. ఆత్మకూరులో జరిగిన ఓ అభివృద్ధి కార్యక్రమానికి కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు, మంత్రులు నారాయణ, గంటా శ్రీనివాసరావు తదితరులు హాజరైనా వైకాపా ఎమ్మెల్యే గౌతంరెడ్డి, ఎంపి రాజమోహన్‌రెడ్డి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఎంపి ల్యాడ్స్ క్రింద ఆత్మకూరు నియోజకవర్గంలో ఎన్ని అభివృద్ధి పనులు చేపట్టారో మేకపాటి రాజమోహన్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. నెల్లూరు జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డికి ప్రోటోకాల్ అంటే ఏమిటో తెలియదన్నారు. ఈ సమావేశంలో నెల్లూరుజిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామి నాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తేలని ఉపాధ్యాయ అభ్యర్థి?




తూర్పురాయలసీమ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి తెలుగుదేశంపార్టీ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిని అభ్యర్థిగా ప్రకటించడం, అతను జోరుగా ప్రచారం చేసుకుంటుండడం తెలిసిందే! యూటిఎఫ్ మాత్రం ఈ రెండు నియోజకవర్గాలకు ఇంతకుముందు గెలిచిన వాళ్లనే దించింది. ప్రతిపక్ష వైకాపా ఈ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. అధికార తెలుగుదేశం పార్టీ నుండి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రకటించాల్సి వుంది. మంత్రి నారాయణ, మాజీమంత్రి పరసారత్నంను అభ్యర్థిగా ప్రకటించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయితే టీటీడీ ఛైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి సతీమణి చదలవాడ సుచరిత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సీటు కోసం గట్టిగా ప్రయత్నిస్తుంది. ఒకవేళ పార్టీ సీటు ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గానైనా బరిలోకి దిగాలని ఆమె భావిస్తున్నట్లు సమాచారం. ఇండిపెండెంట్‌గా పోటీచేసినా అన్ని పార్టీల వాళ్లు తనకు సహకరిస్తారన్నది ఆమె ఆలోచన. ఒక దశలో బీజేపీ అనుబంధ ఉపాధ్యాయ సంస్థ అపస్ అభ్యర్థిగా సీటు తెచ్చుకునేందుకు మంతనాలు సాగించినా, బీజేపీ వాళ్లు అందుకు ఒప్పుకోలేదని తెలిసింది!

### మనోహర్‌రెడ్డి ప్రయాస వృధానా?

తెలుగుదేశంపార్టీ అన్నా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నా వల్లమాలిన అభిమానం చూపించే వ్యక్తి మైథిలి స్కూల్ డైరెక్టర్ బి.మనోహర్‌రెడ్డి. జిల్లాలో పలు చోట్ల యంఇఓగాను, రాజీవ్ విద్యామిషన్ ప్రాజెక్ట్ అధికారిగాను సుపరిచితుడు. 1995, 2004 మధ్య కాలంలో చంద్రబాబు చేపట్టిన జన్మభూమి కార్యక్రమానికి జిల్లాలోనే కొత్త సొగసులు అద్దిన వ్యక్తి. ఉద్యోగ విరమణ చేసాక చంద్రబాబు మీద అభిమానంతో తెలుగుదేశం పార్టీలో చేరి పూర్తి స్థాయి కార్యకర్తగా పనిచేస్తున్నారు. 2014 నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో ఆయన ఒక డివిజన్ కార్పొరేటర్ టిక్కెట్‌ను ఆశించినా, పార్టీలో నెలకొన్న వర్గ రాజకీయాల మూలంగా ఆయనకు టిక్కెట్ రాలేదు. అయినా పార్టీ సేవలోనే ఉంటున్నాడు. ఇప్పుడు పార్టీ నుండి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోసం ప్రయత్నించారు. ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు కూడా ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు కల్పించే జిఓను దుమ్ము దులిపి బయటకు తీసారు. ఆయన కృషి మూలంగానే ఈ రోజు మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఓటు హక్కు వచ్చింది. ఇంత చేసిన మనోహర్‌రెడ్డి ఎమ్మెల్సీ సీటు విషయంలో కేవలం కుల సమీకరణల వల్ల వెనుకబడ్డాడు. మొదట ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మనోహర్ రెడ్డి పేరే తెరమీదకొచ్చింది. అయితే మంత్రి నారాయణ దీనికి గండికొట్టినట్లు సమాచారం. మనోహర్‌రెడ్డికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సీటిస్తే అదే కులం, ఇదే జిల్లాకు చెందిన తన అనుచరుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డికి పట్టభద్రుల ఎమ్మెల్సీ సీటు ఇప్పించుకోవడం కుదరదనే... ముందుగా పట్టభద్రుల సీటును పట్టాభికి ఇప్పించుకున్నాడు. ఇప్పుడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా మనోహర్‌రెడ్డి వద్దకు వచ్చేసరికి కులం, ఒకే జిల్లా అంశాలే అడ్డు తగులుతున్నాయి. మనోహర్‌రెడ్డికి చంద్రబాబు మీద అభిమానం తప్ప, కుళ్ళ రాజకీయాలు తెలియవు. కాబట్టే సీటు విషయంలో వెనుకబడ్డట్లు తెలుస్తోంది.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# లారీల అపహరణ ముఠా అరెస్ట్

## రెండు లారీలు స్వాధీనం - డిఎస్పీ శ్రీనివాస్ వెల్లడి




గూడూరు సమీపంలోని జాతీయ రహదారిపై నిలిపివున్న లారీలను చాకచక్యంగా అపహరించి వేరే జిల్లాల్లోని పాత లారీల నెంబర్లు వేసి ఎంచక్కా తిప్పుతూ వుండే ఓ ముఠా పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు. ఆరుగురు అంతర్‌జిల్లా లారీల అపహరణ ముఠాను పోలీసులు పకడ్బందీ వ్యూహంతో అరెస్ట్‌చేసి, వారి నుంచి రెండు లారీలను స్వాధీనం చేసుకున్నారు. గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆ వివరాలను విలేకరులకు వెల్లడించారు. జిల్లాలోని సూళ్ళూరుపేటకు చెందిన రుద్రపాటి కృష్ణయ్య, చిల్లకూరు మండలం వల్లిపేడుకు చెందిన షేక్ షఫీ, 2015 నవంబర్‌లో చిల్లకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక లారీని, వరగలి క్రాస్‌రోడ్డు వద్ద నిలిపివున్న మరొక లారీని అపహరించారు. ఆ లారీలను కడపజిల్లా రాయచోటికి చెందిన షేక్‌ఖాజావలి, మయాన తాలిబ్ ఆలీఖాన్‌లకు అమ్మి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అనంతపురం జిల్లా హిందూపురానికి చెందిన సయ్యద్ హజరత్ ఆలీ వాటికి రిపేర్లు చేయించి మధ్యవర్తిగా లారీని షేక్ మహమ్మద్ షఫీవుల్లాకు అమ్మారు. షఫీవుల్లాకు చెందిన పాత లారీలను తీసుకుని, నెంబర్లు మార్చి తిప్పుకుంటున్నారు. ఈనెల 13న వాటిని నెల్లూరు ఆటోనగర్‌లో అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా గూడూరు రూరల్ సిఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌ఐ బాబి, సిబ్బంది అంతర్‌జిల్లా లారీల అపహరణ ముఠాను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. వారిని అరెస్ట్ చేసేందుకు కృషి చేసిన పోలీసు సిబ్బందిని డిఎస్పీ అభినందించారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువెళ్ళినట్లు తెలిపారు. ఈ సమావేశంలో చిల్లకూరు, సైదాపురం ఎస్‌ఐలు అంకమ్మ, ఏడుకొండలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.



## గూడూరు డివిజన్ వార్తలు



## మాస్టర్స్ క్రికెట్‌క్లబ్ క్రికెట్ పోటీలు

సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో మాస్టర్స్ క్రికెట్‌క్లబ్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు జరిగిన క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ, క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, క్రీడాకారులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా వుండేందుకు క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. శాప్ డైరెక్టర్ రవీంద్రబాబు, డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్, కనుమూరి హరిశ్చంద్రారెడ్డి తదితరులు మాట్లాడుతూ, ఏటా గూడూరు వాసులు ఈ క్రీడాపోటీలను ఏర్పాటుచేసి స్నేహపూర్వకంగా అందరూ కలసిమెలసి వుండేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషదాయకమన్నారు. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులను, షీల్డులను అందజేశారు. నిర్వాహకులు కె.మునిగిరీష్, నాగేశ్వరరావు, మనపాటి రవీంద్రబాబు, లవకుమార్, పిఆర్ మణి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ కోదండరాముని తెప్పోత్సవం



కనుమ పండుగను పురస్కరించుకుని సోమవారం రాత్రి గూడూరులో శ్రీ కోదండరామునికి తెప్పోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ నిర్వహించారు. ప్రత్యేకంగా తెప్పపై వేంచేపు చేసి స్వామివారికి తెప్పోత్సవం నిర్వహించారు. తొలుత రంగురంగుల విద్యుద్దీపాలంకరణలతో కోనేరు పరిసర ప్రాంతాలనంతా శోభాయమానం చేశారు. మేళతాళాలు, తప్పెట్లు, బాణసంచా వేడుకల మధ్య స్వామివారి తెప్పోత్సవం ఘనంగా జరిగింది. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఉభయకర్తలు కనుమూరి హరిశ్చంద్రారెడ్డి దంపతులు, గూడూరు డిఎస్పీ బి.శ్రీనివాస్, ఎల్లసిరి గోపాల్ రెడ్డి, కోడూరు మీరారెడ్డి, నిర్వాహకులు కె.మునిగిరీష్, నాగేశ్వరరావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## 400 సంవత్సరాల 'శాశ్వత దినదర్శిని'



నెల్లూరుజిల్లాకు చెందిన ప్రముఖ అవధాని, అల్లూరు రామకృష్ణ జూనియర్ కళాశాల విశ్రాంత సంస్కృత ఉపన్యాసకుడు, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కోట రాజశేఖర్ అవధాని ఓ అద్భుతమైన క్యాలెండర్‌ను రూపొందించారు. నాలుగువందల సంవత్సరాల 'శాశ్వత దినదర్శిని' ని తయారు చేశారు. మనం కోరుకున్న తేదీకి వారం తెలుసుకోవాలంటే ఇందులో ఖచ్చితంగా తెలుసుకోవచ్చు. అందుకు, తొలుత సంవత్సరాన్ని గుర్తించాలి. ఆ తరువాత కుడివైపు వరుసలోగల నెలను గుర్తించాలి. ఆ తర్వాత పైవైపు ఉన్న తేదీని గుర్తించి, ఎడమవైపు వరుసలో చూస్తే చాలు..మనం కోరుకున్న తారీఖునకు అది ఏ వారమో తెలుస్తుంది. ఇతర వివరాలకు కోట రాజశేఖర్ అవధాని ఫోన్ నెం.9966236604 కు సంప్రదించి తెలుసుకోవచ్చు.

| RAHU TIMINGS | వారములు | DAYS | తేదీలు | | | DATES | | | తేదీలు |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 4.30 - 6.00 | ఆదివారము | SUNDAY | 1 8 15 22 29 | 7 14 21 28 | 6 13 20 27 | 5 12 19 26 | 4 11 18 25 | 31 3 10 17 24 | 30 2 9 16 23 |
| 7.30 - 9.00 | సోమవారము | MONDAY | 2 9 16 23 30 | 1 8 15 22 29 | 7 14 21 28 | 6 13 20 27 | 5 12 19 26 | 4 11 18 25 | 31 3 10 17 24 |
| 3.00 - 4.30 | మంగళవారము | TUESDAY | 3 10 17 24 31 | 2 9 16 23 30 | 1 8 15 22 29 | 7 14 21 28 | 6 13 20 27 | 5 12 19 26 | 4 11 18 25 |
| 12.00 - 1.30 | బుధవారము | WEDNESDAY | 4 11 18 25 | 3 10 17 24 31 | 2 9 16 23 30 | 1 8 15 22 29 | 7 14 21 28 | 6 13 20 27 | 5 12 19 26 |
| 1.30 - 3.00 | గురువారము | THURSDAY | 5 12 19 26 | 4 11 18 25 | 3 10 17 24 31 | 2 9 16 23 30 | 1 8 15 22 29 | 7 14 21 28 | 6 13 20 27 |
| 10.30 - 12.00 | శుక్రవారము | FRIDAY | 6 13 20 27 | 5 12 19 26 | 4 11 18 25 | 3 10 17 24 31 | 2 9 16 23 30 | 1 8 15 22 29 | 7 14 21 28 |
| 9.00 - 10.30 | శనివారము | SATURDAY | 7 14 21 28 | 6 13 20 27 | 5 12 19 26 | 4 11 18 25 | 3 10 17 24 31 | 2 9 16 23 30 | 1 8 15 22 29 |

| సంవత్సరములు YEARS సంవత్సరములు | నెలలు | | | MONTHS | | | నెలలు |
|---|---|---|---|---|---|---|---|
| * 22 50 78 06 34 62 90 02 30 58 86 * 26 54 82 | 1 10 | 5 | 8 | 2 3 11 | 6 | 9 12 | 4 7 |
| 1900 23 51 79 07 35 63 91 03 31 59 87 * 27 55 83 | 4 7 | 1 10 | 5 | 8 | 2 3 11 | 6 | 9 12 |
| * 24 52 80 08 36 64 92 04 32 60 88 * 28 56 84 | 6 | 9 12 | 1 4 7 | 10 | 5 | 2 8 | 3 11 |
| * 25 53 81 09 37 65 93 05 33 61 89 01 29 57 85 | 2 3 11 | 6 | 9 12 | 4 7 | 1 10 | 5 | 8 |
| * 26 54 82 10 38 66 94 06 34 62 90 02 30 58 86 | 8 | 2 3 11 | 6 | 9 12 | 4 7 | 1 10 | 5 |
| * 27 55 83 11 39 67 95 07 35 63 91 03 31 59 87 | 5 | 8 | 2 3 11 | 6 | 9 12 | 4 7 | 1 10 |
| * 28 56 84 12 40 68 96 08 36 64 92 04 32 60 88 | 1 4 7 | 10 | 5 | 2 8 | 3 11 | 6 | 9 12 |
| 01 29 57 85 13 41 69 97 09 37 65 93 05 33 61 89 | 9 12 | 4 7 | 1 10 | 5 | 8 | 2 3 11 | 6 |
| 02 30 58 86 14 42 70 98 10 38 66 94 06 34 62 90 | 6 | 9 12 | 4 7 | 1 10 | 5 | 8 | 2 3 11 |
| 03 31 59 87 15 43 71 99 11 39 67 95 07 35 63 91 | 2 3 11 | 6 | 9 12 | 4 7 | 1 10 | 5 | 8 |
| 04 32 60 88 16 44 72 * 12 40 68 96 08 36 64 92 | 5 | 2 8 | 3 11 | 6 | 9 12 | 1 4 7 | 10 |
| 05 33 61 89 17 45 73 * 13 41 69 97 09 37 65 93 | 1 10 | 5 | 8 | 2 3 11 | 6 | 9 12 | 4 7 |
| 06 34 62 90 18 46 74 * 14 42 70 98 10 38 66 94 | 4 7 | 1 10 | 5 | 8 | 2 3 11 | 6 | 9 12 |
| 07 35 63 91 19 47 75 * 15 43 71 99 11 39 67 95 | 9 12 | 4 7 | 1 10 | 5 | 8 | 2 3 11 | 6 |
| 08 36 64 92 20 48 76 * 16 44 72 * 12 40 68 96 | 3 11 | 6 | 9 12 | 1 4 7 | 10 | 5 | 2 8 |
| 09 37 65 93 21 49 77 2100 17 45 73 * 13 41 69 97 | 8 | 2 3 11 | 6 | 9 12 | 4 7 | 1 10 | 5 |
| 10 38 66 94 22 50 78 * 18 46 74 * 14 42 70 98 | 5 | 8 | 2 3 11 | 6 | 9 12 | 4 7 | 1 10 |
| 11 39 67 95 23 51 79 * 19 47 75 * 15 43 71 99 | 1 10 | 5 | 8 | 2 3 11 | 6 | 9 12 | 4 7 |
| 12 40 68 96 24 52 80 * 20 48 76 * 16 44 72 * | 9 12 | 1 4 7 | 10 | 5 | 2 8 | 3 11 | 6 |
| 13 41 69 97 25 53 81 * 21 49 77 2200 17 45 73 * | 6 | 9 12 | 4 7 | 1 10 | 5 | 8 | 2 3 11 |
| 14 42 70 98 26 54 82 * 22 50 78 * 18 46 74 * | 2 3 11 | 6 | 9 12 | 4 7 | 1 10 | 5 | 8 |
| 15 43 71 99 27 55 83 * 23 51 79 * 19 47 75 * | 8 | 2 3 11 | 6 | 9 12 | 4 7 | 1 10 | 5 |
| 16 44 72 2000 28 56 84 * 24 52 80 * 20 48 76 * | 10 | 5 | 2 8 | 3 11 | 6 | 9 12 | 1 4 7 |
| 17 45 73 01 29 57 85 * 25 53 81 * 21 49 77 2300 | 4 7 | 1 10 | 5 | 8 | 2 3 11 | 6 | 9 12 |
| 18 46 74 02 30 58 86 * 26 54 82 * 22 50 78 * | 9 12 | 4 7 | 1 10 | 5 | 8 | 2 3 11 | 6 |
| 19 47 75 03 31 59 87 * 27 55 83 * 23 51 79 * | 6 | 9 12 | 4 7 | 1 10 | 5 | 8 | 2 3 11 |
| 20 48 76 04 32 60 88 * 28 56 84 * 24 52 80 * | 2 8 | 3 11 | 6 | 9 12 | 1 4 7 | 10 | 5 |
| 21 49 77 05 33 61 89 01 29 57 85 * 25 53 81 * | 5 | 8 | 2 3 11 | 6 | 9 12 | 4 7 | 1 10 |

## ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో తనిఖీలు



ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలు, సేవలు ఎలా వినియోగించుకుంటున్నారనే విషయమై సోమవారం వైద్యఆరోగ్యశాఖ ఉప సంచాలకులు శివశంకరబాబు ఆరాతీశారు. చిల్లకూరులోని పిహెచ్‌సితో పాటు, నెలబల్లి, రెట్టపల్లి, చిల్లకూరుల్లో వున్న ఆరోగ్య ఉపకేంద్రాలను ఆయన పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో వైద్యసేవల స్థితిగతులను ఆయన తెలుసుకున్నారు. వీటిని ఆయన ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట సాంకేతిక సహాయకుడు రఫీ తదితరులున్నారు.

### 29న పల్స్‌పోలియో :

ఈ నెల 29న పల్స్‌పోలియో నిర్వహిస్తున్న నేపథ్యంలో, గూడూరు ఉపవైద్యాధికారి డాక్టర్ ఈదూరు సుధాకర్ చిల్లకూరు పిహెచ్‌సిలోని మందులు నిల్వచేసే గిడ్డంగిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ అయిదేళ్ళలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించుకోవాలన్నారు. ప్రైవేటు వైద్యశాలల్లో చిన్నారులకు ట్రైవాలెంట్ వాక్సిన్ వేయడం పూర్తిగా నిషిద్ధమన్నారు.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 20.1.2017 నుండి**
**తేది. 26.1.2017 వరకు**

ఈ వారము సింహంలో రాహువు, కన్యలో గురువు, తులవృశ్చిక ధనుస్సులలో చంద్రుడు, వృశ్చికంలో శని, ధనుస్సులో బుధుడు, మకరంలో రవి, కుంభంలో శుక్ర కేతువులు, మీనంలో కుజుడు సంచరిస్తారు.

### పంచాంగము:

తేది 26 గురువారము రిపబ్లిక్ దినోత్సవము.
ముహూర్తములు లేవు.

### పుష్య మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 20 | శుక్ర | అష్టమి | సా॥ గం.5.48వ॥ |
| తేది. 21 | శని | నవమి | రా॥ గం.7.47వ॥ |
| తేది. 22 | ఆది | దశమి | రా॥ గం.9.57వ॥ |
| తేది. 23 | సోమ | ఏకాదశి | రా॥ గం.12.08వ॥ |
| తేది. 24 | మంగళ | ద్వాదశి | రా॥ గం.2.09వ॥ |
| తేది. 25 | బుధ | త్రయోదశి | రా॥ గం.3.53వ॥ |
| తేది. 26 | గురు | చతుర్దశి | రా॥ గం.5.08వ॥ |

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆరోగ్యం నెమ్మదిగా కుదుటపడుతుంది. కొత్త పెట్టుబడులు, వ్యాపార విస్తరణ ఆలోచనలను తాత్కాలికంగా వదలండి. ఖర్చులు ఎక్కువగా వుండి రుణం చేయవలసివస్తుంది. ఆలోచనలు పెరిగి మానసిక వత్తిడి వుంటుంది. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో సామాన్య ఆదాయం వుంటుంది. రావలసిన బాకీలు నిలబడిపోతాయి.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

పనులు హడావిడిగా సాగుతాయి. వృత్తిపరంగా అభివృద్ధి ఆదాయం పెరుగుతుంది. వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. కోర్టు కేసులు వాయిదా పడగలవు. ఉద్యోగులకు అదనపు పనిభారం వుంటుంది. అధికారులకు కొత్త బాధ్యతలు స్థానచలనం ఉంటుంది. దూర ప్రయాణాల శ్రమ. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. ఆర్థికంగా కుదుటపడతారు. విద్యాప్రగతి కలదు.

### మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆర్థికస్థితి బాగుంటుంది. వ్యాపార విస్తరణ, కొత్త ఆదాయ అవకాశాలు దొరుకుతాయి. వృత్తి వ్యాపారాలు లాభదాయకంగా వుంటాయి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. విద్యార్థులకు చదువుపై మరింత శ్రద్ధ అవసరం. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం కాగలదు. దూరప్రయాణాలు నిర్ణయం కాగలవు. సోదరవర్గంతో చిన్న సమస్యలుండవచ్చును.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

చేయదలచిన ఆలోచనలు కార్యరూపంలోనికి వస్తాయి. వ్యాపారాలు ఆశాజనకంగా వుండి కొద్ది లాభాలుంటాయి. అవసరాలకు డబ్బు చేతికి అందుతుంది. వస్తు వాహన రిపేర్లు, కుటుంబ సభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. కొత్త అగ్రిమెంట్లు, సంప్రదింపులు ఫలించగలవు. ముఖ్య వ్యక్తులను కలుసుకొనలేక పోవచ్చును. కోర్టు కేసులు వాయిదా పడతాయి.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆర్థిక విషయాల్లో జాగ్రత్తగా వ్యవహరించండి. నిర్ణయాలు సొంతంగా తీసుకుంటే మంచిది. వృత్తి, వ్యాపారాలు సంతృప్తికరంగా సాగి ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలుంటాయి కానీ జాగ్రత్తగా వ్యవహరించాలి. శుభకార్యముల నిర్ణయం జరుగుతుంది. అనుకున్నపనులు సరిగా జరగక చికాకు, టెన్షన్ వుంటుంది.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగ ప్రయత్నాల్లో అనుకూలత బాగుంటుంది. ఆడిటర్లు, పరిశ్రమ యజమానులకు, న్యాయవాదులకు, చిన్న పరిశ్రమల వర్గాలకు ఆదాయం బాగుంటుంది. చేయదలచిన పనులు నిదానంగా జరుగుతాయి. ఆరోగ్యం బాగుంటుంది. కోర్టు వ్యవహారాలు, రావలసిన బాకీలు వాయిదా పడగలవు. శుభకార్యాల ప్రయత్నాలు పెరుగుతాయి. విద్యా ప్రగతి బాగుంటుంది.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా వుంటాయి. ఆదాయానికి ధీటుగా ఖర్చులుంటాయి. అవసరాలకు డబ్బు రూపంలో ఇతరులనుంచి సహాయం దొరుకుతుంది. అనుకున్న పనులకు అవకాశాలు బాగుండి నెమ్మదిగా జరుగుతాయి. ముఖ్య వస్తువులు పత్రాలు నగదు జాగ్రత్తపరచుకొనండి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. ఉద్యోగార్థులు కొద్దికాలం వేచివుండాలి.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కొత్త పరిచయాలు జరిగి ప్రయోజనం పొందుతారు. అనుకున్న పనులు ఏదో ఒకవిధంగా నెరవేరుతాయి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. సభలు సమావేశాల్లో ప్రముఖ పాత్ర నిర్వహిస్తారు. కోర్టుకేసులు కొంత సానుకూలం కాగలవు. ఉద్యోగులకు పనిభారం బాధ్యతలు పెరుగుతాయి. ఉద్యోగార్థులకు అనుకూలత బాగుంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కుటుంబంలో కొద్దిపాటి భేదాభిప్రాయాలుండి సర్దుబాటు కాగలదు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. కొన్ని అనవసర ఖర్చులు తప్పనిసరిగా వుంటాయి. ఇతరులతో నెమ్మదిగా, శాంతంగా వ్యవహారాలు జరపడం మంచింది. కాకుంటే తగవులు ఏర్పడే అవకాశం వున్నది. కోర్టు కేసులందు కొంత అనుకూలత కలదు.


### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

అవసరాలకు ఇతరులను బట్టి సర్దుకునిపోతూ పనులు జరుపుకొనవలసివుంటుంది. చిరువ్యాపారులు, వృత్తిజీవనం కలవారికి ఆర్థిక స్థితి బాగుంటుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. వ్యాపార విస్తరణకు, కొత్త పెట్టుబడులకు అవకాశాలు సరిగా వుండవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. ఉద్యోగులకు అధికార వర్గంతో సత్సంబంధాలు వుంటాయి.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కుటుంబంలో సమస్యలుంటే చర్చించి పరిష్కరించగలరు. జీవితభాగస్వామికి ఆరోగ్య లోపం కలుగవచ్చును. దూర ప్రయాణాలుంటాయి. ప్రభుత్వ సమ్మానాలు పొందడం, అధికారులతో సన్నిహితంగా మెలగడం జరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో సామాన్య ఆదాయం వుంటుంది. ఆర్థిక ఇబ్బంది లేకున్నను సంతృప్తి వుండదు. అనుకున్న పనులు సరిగా జరుగక టెన్షన్ పడుతుంటారు.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనుకున్న పనులు సక్రమంగా జరుపుకొనగలిగిన సమర్థత వుంటుంది. ఆర్థికస్థితి బాగుంటుంది. రావలసిన బాకీలు కొంతవరకు లభిస్తాయి. ప్రభుత్వ అనుమతులు పొందగలరు. చెల్లింపులు, పన్నులు చెల్లించగలరు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది. పట్టింపులు పంతాలకు పోకుండా ఎదుటివారికి విలువ ఇవ్వవలసి వుంటుంది. విద్యార్థులకు విద్యాప్రగతి బాగుంటుంది.

# నేతల సంక్రాంతి సందడి

శ్రీను గల్పిక

జనవరి 13వ తేదీ... వేకువజామున 4గంటలు. ప్రధాని నరేంద్రమోడీ నివాసం. మోడీతో పాటు కేంద్రమంత్రులు అరుణ్‌జైట్లీ, వెంకయ్యనాయుడు, మనోహర్ పారికర్, ప్రకాశ్‌జవదేకర్, రాజ్‌నాథ్ సింగ్‌లు ఉన్నారు. వెంకయ్యనాయుడు ఆధ్వర్యంలో అక్కడ భోగి మంట ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొన్ని కట్టెలు పేర్చి వెంకయ్య నిప్పుపెట్టాడు. మంట రేగింది. అందరూ దాని చుట్టూ చేరి చలికాచుకోసాగారు. మోడీ వుండి... వెంకయ్యాజీ ఈ భోగి మంటల్లో ఏమేం వేస్తారు అని అడిగాడు. మనం వాడి పక్కనపడేసిన వస్తువులు వేస్తారని చెప్పాడు. వెంటనే మోడీ అరుణ్‌జైట్లీని పిలిచి చెవిలో ఏదో చెప్పాడు. అరుణ్‌జైట్లీ అక్కడనుండి వెళ్లిపోయాడు. పది నిముషాలలో మళ్ళీ ఓ లారీతో వచ్చాడు. వెంకయ్య అది చూసి ఈ లారీ ఏంటని అడిగాడు. దాని నిండా పాత వెయ్యి, ఐదొందల నోట్లున్నాయని, ఎలాగూ అవి చెల్లకుండా పోయాయి కాబట్టి వాటిని భోగి మంటలో వేద్దామని మోడీ అన్నాడు. అరుణ్‌జైట్లీ అందుకుని... మన బోగి మంటకే కాదు, ప్రజలందరి బోగి మంటలకు పంపిణీ చేద్దామన్నాడు. అప్పుడు వెంకయ్య... సార్, జీవితాంతం పాలిచ్చి ఒట్టిపోయిన ఆవులను కబేళాలకు తరలించడాన్నే మనం వ్యతిరేకిస్తుంటాం, అలాంటిది ఇన్నేళ్ల పాటు మన అవసరాలు తీర్చిన ఈ పాత నోట్లను మనమే తగలబెట్టడం భావ్యం కాదు. బోగి మంటకని మా ఊరు చౌటపాలెం నుండి స్పెషల్ ఫ్లైట్‌లో తాటాకులు తెప్పించాను. మా ఊరు తాటాకులతో బోగి మంట వేస్తేగాని నాకు తృప్తి వుండదు అని, తాటాకు తేవడానికి తన ఇంటివద్దకు వెళ్లాడు.

★★★★★

అమరావతిలో సీఎం క్యాంపు కార్యాలయం. హైటెక్‌రత్న చంద్రబాబు, మంత్రులు పల్లె రఘునాథరెడ్డి, దేవినేని ఉమ, పత్తిపాటి పుల్లారావు, పి.నారాయణ, పీతల సుజాత, పరిటాల సునీతలు బోగి మంట వేయడానికి సిద్ధంగా ఉన్నారు. అయితే అక్కడ కట్టెలు, తాటాకులు వంటివి లేవు. సార్, బోగి మంట వేయడానికి సరంజామా ఏదని దేవినేని ఉమ అడిగాడు. అంతలోనే డబడబ మనే శబ్దంతో హెలికాప్టర్ అక్కడ దిగింది. అందులో నుండి తాటాకులు, ఆవుపేడ పిడకలు దించారు. ఇదెక్కడ నుండి తెప్పించార్సార్ అని పత్తిపాటి పుల్లారావు అడిగాడు. అందుకు చంద్రబాబు... మా నారావారి పల్లె నుండి తెప్పించాను. అవి మా తాటి చెట్ల ఆకులే. అవి మా ఆవుల పేడతో చేసిన పిడకలే! వాటితో బోగి మంట వేసుకుని చలికాచుకుంటే ఆ ఆనందమే వేరు అని అన్నాడు. అది విన్న పి.నారాయణ, హెలికాప్టర్‌లో పిడకలు, తాటాకులు తెప్పించి బోగిమంట వేసిన ఏకైక ముఖ్యమంత్రిగా మీరు చరిత్రలో నిలిచి పోతార్సార్ అంటూ కీర్తించాడు.

★★★★★

ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు నెలవైన నెల్లూరు. విఆర్‌సి మైదానంలో రాజకీయ నాయకుల సంక్రాంతి వేడుకలకు ఏర్పాట్లు జరిగాయి. స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి(66) ఆనం రామనారాయణరెడ్డి, సింహపురి చాణిక్య సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, బొల్లినేని రామారావు, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మేకపాటి గౌతంరెడ్డి, కిలివేటి సంజీవయ్య, సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, పి.సురేంద్రరెడ్డి, పి.దశరథరామయ్య, పి.మోహన్‌రావు వంటి అన్ని పార్టీల నాయకులు అక్కడ వున్నారు. మహిళా నాయకురాళ్ళు ఓ పక్క ముగ్గులు వేసుకుంటున్నారు. ఓ పక్క వివేకా భోగిమంట కోసం తాటాకులు పేర్చాడు. దాని మీద పచ్చగడ్డి పరిచాడు. అది చూసి నారాయణ, ఆదాలలు... వివేకా, ఇక్కడ కూడా ఎకసెక్కాలేనా... పచ్చిగడ్డి ఎలా మండుద్ది అని అడిగాడు. దానికి ఒక స్పెషల్ ఎఫెక్ట్‌ను అరేంజ్ చేసాలే... చూస్తూ ఉండండి ఎలా మంట అంటుకుంటుందోనని చెప్పాడు. ఏంటో, ఈ వివేకా ఈ జీవితానికి అర్థంకాడు అని ఆదాల తల గోక్కోసాగాడు. భోగిమంట సెట్టింగ్ పూర్తయ్యాక వివేకా రెడీ వన్, టూ, త్రీ అని అరిచాడు. భోగిమంట సెట్టింగ్‌కు ఓ వైపు నుండి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఇంకోవైపు నుండి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వచ్చారు. అటు సోమిరెడ్డి... ఇటు కాకాణి... మధ్యలో బోగి మంటకు రెడీగా పెట్టిన పచ్చిగడ్డి... వీళ్లిద్దరూ ఒకర్నొకరు... కత్తులతో కాదురా కంటి చూపుతో చంపేస్తా అన్నట్లు కోపంగా చూసుకోసాగారు. అంతే వాళ్ల చూపుల సెగకు అక్కడున్న పచ్చగడ్డి ఒక్కసారిగా భగ్గున మండింది. వీళ్లిద్దరి మధ్య వున్న రాజకీయ వైరాన్ని వివేకా ఈ విధంగా ఉపయోగించుకున్నాడా... ఔరా ఇతని తెలివి తగలెయ్యా అని అందరూ నోరెళ్ళబెట్టారు. తర్వాత నాయకులకు బొంగరాలాట, బిళ్లంకోడు, దాగుడుమూతలు, గాలి పటాలు ఎగరేయడం వంటి పోటీలు కూడా జరిగాయి. చివరగా కోడిపందేలకు వచ్చారు. తెలుగుదేశం నుండి సోమిరెడ్డి పెంచిన కోడిని, వైకాపా వైపు నుండి కాకాణి కోడిని పందేనికి సిద్ధం చేసారు. సోమిరెడ్డి చేతిలో వున్న కోడిని వివేకా ప్రేమగా నిమురుతూ.. మన కోడికి బాదంపప్పు, జీడిపప్పు, పిస్తాపప్పు బాగా తినిపించారా అని అడిగాడు. దానికి సోమిరెడ్డి... ఒక్క పప్పులేంటి, అది ఏం కావాలంటే అది తినిపించాను. పిజ్జా, బర్గర్‌లు కూడా పెట్టించాను. డోప్ టెస్టుల్లో దొరికిపోతుందేమోనన్న ఆలోచనతో మద్యాన్ని మాత్రం తాగించలేదన్నాడు. ఓకే వెరీగుడ్, బెస్టాఫ్ లక్ అంటూ కోడి కాలికి షేక్‌హ్యాండిచ్చి... ఈ పందెంలో డబ్బంతా మనకే వస్తుందని వివేకా నమ్మకంగా చెప్పాడు. అది విని సోమిరెడ్డి... నేనిప్పుడు డబ్బుల కోసం పందెం ఆడడం లేదు. నాకు ఆ అవసరం కూడా లేదు. అకస్మాత్తుగా వచ్చిపడ్డ వెయ్యికోట్లను ఏం చేసుకోవాలో తెలియక సతమతమవుతున్నాను. ఒకవేళ పందెంలో డబ్బు వచ్చినా అది పేదల కోసమే ఇచ్చేస్తాను. కేవలం కాకాణి కోడి మీద గెలుపు కోసమే నేను ఈ పందెంలో దిగుతున్నానని చెప్పాడు. తర్వాత ఆదాల మధ్యవర్తిత్వంగా ఇరువురి కోళ్లపై నాయకులు లక్ష నుండి 10 లక్షల దాకా పందేలు కడుతున్నారు. తెలుగుదేశం వాళ్ళు సోమిరెడ్డి కోడి మీద, వైకాపా వాళ్ళు కాకాణి కోడి మీద భారీగా పందేలు కాసారు. వివేకా మాత్రం ఆదాల వద్దకు వెళ్లి సోమిరెడ్డి కోడి మీద లక్ష, కాకాణి కోడి మీద లక్ష అంటూ పందెం కాసాడు. ఆదాల ఆశ్చర్యంగా... అదేంటి, ఎవరైనా ఒక కోడి మీద పందెం కడతారు, నువ్వేంటి రెండు కోళ్ల మీద బెట్టింగ్ పెట్టావ్... దీనివల్ల ఉపయోగమేముందన్నాడు. కోళ్ల పందేలలో నేనూ పాల్గొనాలనేది నా సరదా! అలాగని నా డబ్బులు పోకూడదు. అందుకని రెండు కోళ్ల మీద పందెం కట్టాను. ఏ కోడి గెలిచినా నా కోడి గెలిచిందని సంతోషపడతాను అని చెప్పాడు. ఆ లాజిక్ విని ఆదాలకు బుర్ర గిర్రున తిరిగింది. పందేల తంతు ముగిసాక సోమిరెడ్డి, కాకాణిలు తమ కోళ్లను రెచ్చగొట్టి బరిలోకి దించారు. అందరూ వాటి మధ్య జరిగే భయంకరమైన ఫైటింగ్ కోసం ఆసక్తిగా చూడసాగారు. కాని ఆశ్చర్యంగా ఆ రెండు కోళ్లు... కొక్కరొక్కో అంటూ అరుచుకుంటూ ఒకదానితో ఒకటి మెడ మెడ రాసుకుంటూ స్నేహంగా ఉండసాగాయి. అది చూసి అందరికీ మతిపోయింది. ఈ కోళ్లకు ఏమైంది... పౌరుషం చచ్చిందా... ఒంట్లో రక్తం చల్లబడిపోయిందా అని అందరూ గట్టిగా అరిచారు. అప్పుడు అక్కడున్న వారి మధ్యలో నుండి సినీ నటుడు ఆలీ వచ్చాడు. అందరూ ఆశ్చర్యంగా అతనిని చూస్తుండగా... ఆలీ అందరితో... ఈ దారిన పోతూపోతూ ఈ పోటీలను చూద్దామని వచ్చాను. నాకు కోడి బాష తెలుసు. ఆ రెండు కోళ్లు ఏం మాట్లాడుకున్నాయో తెలుసా? ఈ నాయకులు ఈరోజు తన్నుకుంటారు, రేపు కలిసిపోతారు. వీళ్ల పంతాలు, పందేల కోసం మనల్ని మనం ఎందుకు చంపుకోవాలి. ఇద్దరం రాజీ పడదాం అని చెప్పుకున్నాయి, అందుకే అవి తన్నుకోలేదు, అవి చూపిన స్ఫూర్తితోనైనా మీరు కలిసి మెలసి ఉండండి అని చెప్పాడు. ఔరా! కోళ్లకు కూడా రాజకీయ నాయకుల నైజం గురించి తెలిసిపోయిందా? అంటూ అక్కడున్నవాళ్లు నోరెళ్లబెట్టారు.

## శుభమస్తులో...
# ఐదో నానో కారు డ్రా



క్రిస్‌మస్, న్యూఇయర్, సంక్రాంతి పండుగల సందర్భంగా నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లోని 'శుభమస్తు' షాపింగ్ మాల్ వారు ఈ నెల 18వ తేదీ నిర్వహించిన ఐదో డ్రాకు మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసారు. ఆయన చేతులమీదుగా 5వ నానోకారు డ్రా తీయగా ఏవిఎస్ శ్రీకాంత్ విజేతగా నిలిచి కారును గెలుచుకున్నారు. రోజుకో పట్టుచీర డ్రాను మాజీమేయర్ ఎన్. భానుశ్రీ చేతుల మీదుగా తీయగా శ్రీనివాసరావు విజేతగా నిలిచారు. ఈ కార్యక్రమంలో షాపింగ్‌మాల్ అధినేతలు బయ్యా శ్రీనివాసరావు, బయ్యా రవికుమార్‌లు పాల్గొన్నారు.

# విఆర్‌సి వాకర్స్ సంక్రాంతి



నెల్లూరులోని విఆర్‌సి మైదానంలో విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి సంక్రాంతి పండుగ విశిష్టతను తెలియజేశారు. బంధాలు, బంధుత్వాలను ఒకేచోట కలిపే వేదిక ఈ వేడుక అని పేర్కొన్నారు. వాకర్స్ అందరికీ సంక్రాంతి పిండివంటలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి. భాస్కర్‌రావు, నాగేశ్వరరావు, వి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో ఇస్రో శాస్త్రజ్ఞుల బృందం



45మంది సభ్యులుగల ఇస్రో శాస్త్రజ్ఞుల బృందం గురువారం శ్రీసిటీలో పర్యటించింది. శ్రీసిటీ మార్కెటింగ్ అధికారులు ఇస్రో బృందానికి స్వాగతం పలికి, శ్రీసిటీలో నెలకొల్పిన ప్రపంచ స్థాయి పారిశ్రామిక మౌళిక వసతులు, వాటి ప్రత్యేకతలు, పరిశ్రమలను స్థాపించిన వివిధ దేశ, విదేశ సంస్థల గురించి విశదీకరించారు. వివిధ ఇస్రో కేంద్రాలలో పనిచేస్తున్న శాస్త్రజ్ఞుల బృందం శ్రీసిటీకి విచ్చేయటం, ఇక్కడి అంతర్జాతీయ స్థాయి మౌళిక వసతుల గురించి తెలుసుకోవటం, పరిశ్రమలను సందర్శించటం తమకు ఆనందాన్నిస్తున్నదని, వి.ఆర్.వి. లాగా, సమీప భవిషత్తులో మరిన్ని శ్రీసిటీ పరిశ్రమలు ఇస్రో కార్యక్రమాలకు అవసరమైన ఉత్పత్తులను సరఫరా చేయగలవన్న ఆశాభావాన్ని శ్రీసిటీ యం.డీ. రవీంద్ర సన్నారెడ్డి వ్యక్తపరచారు.

దేశంలోని వివిధ ఇస్రో కేంద్రాలలో పనిచేస్తున్న శాస్త్రజ్ఞులు శ్రీహరికోటలో జరుగుతున్న ఒక ప్రత్యేక శిక్షణా సదస్సులో పాల్గొంటున్నారు. శిక్షణలో భాగంగా శ్రీసిటీలో జరుగుతున్న పారిశ్రామికాభివృద్ధిని అధ్యయనం చేయటానికై వారు శ్రీసిటీని సందర్శించారు. ముఖ్య విభాగాలలో పర్యటించిన తరువాత, క్రయోజనిక్ టాంకులను తయారు చేసే వి.ఆర్.వి. కర్మాగారాన్ని సందర్శించి, వివిధ సాంకేతిక అంశాలపై ఆక్కడి నిపుణులతో చర్చించారు.

# వెయిట్‌లిఫ్టర్‌కు చేయూతనిచ్చిన గిరీష్



***ఒకరికి ఎవరేస్ట్‌ను ఎక్కేశక్తి ఉంటుంది. కాని, అందుకు చాలిన ఆర్ధిక శక్తి ఉండదు. ఇంకొకరికి ఆర్ధిక శక్తి ఉంటుంది. కాని, ఎవరెస్ట్‌ను ఎక్కాలన్న ఆశ వున్నా తీరిక ఉండదు. కాని వీరిద్దరూ కలిస్తే... ఒకరి కలను ఒకరు సాకారం చేసుకోగలరు. శిల్పి చేతిలో పడితేనే శిల అద్భుతమైన శిల్పంగా మారుతుంది. అప్పుడు శిల్పంతో పాటు దానిని చెక్కిన శిల్పికి కూడా గుర్తింపు వస్తుంది. ప్రతి రంగంలోనూ ఇలా ఒకర్నొకరు ప్రోత్సహిస్తే విజయాలు వాటం తట అవే క్యూ కడతాయి.***


ఇలాంటి విజయానికి ఉదాహరణే మన జిల్లాకు చెందిన వెయిట్‌లిఫ్టర్ కె. తులసి. గతంలో ఎన్నో పోటీల్లో పాల్గొన్న వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారిణి తులసిని నెల్లూరులోని భువనేశ్వరీ సమేత మూల స్థానేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మెన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి ప్రోత్సహించారు. ఈమెలోని ప్రతిభా శక్తి గమనించిన ఆయన ఆమెకు స్పాన్సరర్‌గా వ్యవహరించారు. ఆమెకు కావాల్సిన వసతులు, ఆహారం సమకూర్చారు. ఆల్తూరు గిరీష్‌రెడ్డి తనపై వుంచిన నమ్మకాన్ని తులసి వమ్ము చేయలేదు. ఇటీవల తమిళనాడులోని కోయం బత్తూరులో జరిగిన ఆలిండియా సీనియర్ ఉమెన్స్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం సాధించి, తనను ప్రోత్సహించిన గిరీష్‌రెడ్డికి గర్వకారణంగా నిలిచింది. ఈనెల 18వతేదీన నెల్లూరులోని ఏసి స్టేడియంలో నిర్వహించిన అభినందనసభలో జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, శాప్ సభ్యులు రవీంద్ర బాబు, ఆల్తూరు గిరీష్‌రెడ్డి, జాతీయ వాలీబాల్ క్రీడా కారుడు, గూడూరు రూరల్ సి.ఐ శ్రీనివాసరెడ్డి, ఖేలో ఇండియా ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ రామకృష్ణ, శ్రీకృష్ణ ధర్మరాజు స్వామి దేవస్థానం ఇ.ఓ కోవూరు జనార్ధన్ రెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, స్వర్ణభారత్ ట్రస్ట్ కో–ఆర్డినేటర్ జనార్ధన్ రాజులు ఆమెను ఘనంగా సత్కరించారు. తులసిని ప్రోత్సహించడం ద్వారా ఆల్తూరు గిరీష్‌రెడ్డి క్రీడా శ్రీమంతుడిగా ఎంతో మందికి స్ఫూర్తిప్రదాతగా నిలిచారని ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కొనియాడారు.

# సర్వాంగ సుందరంగా శ్రీకాళహస్తి రాజగోపురం









నాయుడుపేట వైపు నుండి తిరుపతికి వెళ్లేటప్పుడు మనం శ్రీకాళహస్తికి దగ్గరలో ఉన్నామని సూచించే గుర్తు శ్రీకాళహస్తీశ్వర దేవాలయం రాజగోపురం. 1516లో శ్రీకృష్ణ దేవరాయలు తన దక్షిణ భారతదేశ విజయయాత్రకు చిహ్నంగా ఈ రాజగోపురాన్ని నిర్మించారు. ఈ గోపురాన్ని ఆ కాలంలోనే అత్యద్భుతమైన ఇంజనీరింగ్ టెక్నాలజీతో నిర్మించారు. ఎటువంటి సిమెంట్, కాంక్రీట్ లేని కాలంలోనే కేవలం మట్టి, ఇసుకతో కట్టిన ఈ కట్టడం శిల్పకళా సంపదకు కేంద్రంగా వెలసిల్లేది. దాదాపు 500ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా నిలిచిన ఈ గాలిగోపురం పిడుగుపాటు ప్రభావంతో 2010 మే 9వతేదీన కూలిపోయింది. ఈ గోపురం కూలడాన్ని అప్పుడు అరిష్టంగా భావించారు. ఈ అద్భుత నిర్మాణాన్ని కాపాడుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందనే విమర్శలు కూడా వచ్చాయి. అయితే కూలిన గోపురం స్థానంలో కొత్త రాజగోపురం నిర్మాణానికి



## శ్రీకాళహస్తి న్యూస్

కృష్ణపట్నం పోర్టు కంపెనీ అధినేత చింతా విశ్వేశ్వరరావు ముందుకొచ్చారు. రాజగోపురం పనులను శరవేగంగా మొదలు పెట్టారు. ఈశ్వర అనుగ్రహంతో ఆ గోపుర నిర్మాణం చాలా తొందరగా పూర్తయ్యింది. పాత గోపురం స్థానంలో ఇప్పుడు కొత్త గోపురం సాక్షాత్కరిస్తోంది. 19వతేదీ నుండి రాజగోపురం ప్రారంభ సూచకంగా పూజలు ప్రారంభమయ్యాయి. 11రోజుల పాటు అతిరుద్ర యాగాన్ని నిర్వహిస్తున్నారు.

### అతిరుద్ర మహాయాగం

దివ్యక్షేత్రంలో అతిరుద్ర మహాయాగం నిర్వహణకు తనకు ఆ భోళాశంకరుడే అవకాశం కల్పించాడని వివరించారు చింతా విశ్వేశ్వరరావు. ఎంతో పట్టుదలతో ఈ దివ్యక్షేత్రంలో లోకకళ్యాణార్థం 11 రోజులపాటు నిర్వహణకు పూనుకున్నారన్నారు. ఆయన " లాయర్ " ప్రతినిధితో మాట్లాడుతూ ఈ రుద్ర యాగాలకు 350 మంది రుత్వికుల్ని ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. ఒక్కొక్క దేవునికి ఒక్కొక్క సంఖ్య ఉంటుంది. అందులో అతిరుద్ర యాగానికి 133 మంది, చండీయాగానికి 60 మంది, సూర్యయాగానికి 12 మంది, గణపతి యాగానికి 8 మంది ఇలా మొత్తం 350 మంది రుత్వికులు వస్తున్నారని వివరించారు. రుద్రం అంటే 11 సార్లు చదవటం లఘురుద్రం అంటే 121సార్లు, మహారుద్రం అంటే 242 సార్లు, అతిరుద్రం అంటే 14432 సార్లు రుద్రపారాయణం చేయటమన్నారు. 108మహిళలతో (దంపతులు హాజరైనా) కోటి కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు వివరించారు. తాను ఎన్నో యాగాలు నిర్వహించారన్నారు.



## కావలి కబుర్లు

# కళుగోలమ్మ తిరునాళ్ళు



కావలి గ్రామదేవత అయిన కళుగోలమ్మ తల్లి తిరునాళ్ళు పట్టణంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. శనివారం అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు ఆలయం వద్దకు తరలివచ్చారు. ఎన్నడూ లేని విధంగా భక్తులు అధిక సంఖ్యలో రావడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు ఎక్కువ సమయం క్యూలో ఉండాల్సి వచ్చింది. ఆలయ సంప్రదాయం ప్రకారం పాతవూరు లేతోటమ్మ ఆలయం నుండి పెదగొల్ల సమాది వెంకట క్రిష్ణయాదవ్, పెద కాపుల ఆధ్వర్యంలో బొల్లావులు, గంగపెట్టి, వీరతాళ్ళను కళుగోలమ్మ ఆలయం వద్దకు తీసుకువచ్చారు. రాత్రి 11గంటల సమయంలో అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామోత్సవాన్ని మేళతాళాలు, నెమలి ఆటలు, బాణసంచా, కోలాటాలు, కాళికాదేవి వేషధారణలతో ఘనంగా నిర్వహించారు.

# రెడ్డి అంటే ఒక భరోసా!



ఈనెల 16న నెల్లూరు మినీబైపాస్ రోడ్డులోని సంఘమిత్ర స్కూల్‌లో రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో రెడ్డి సోదరులకు దశ దిశా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి రెడ్లు పెద్దఎత్తున వచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జాగృతి జాతీయ అధ్యక్షులు పిట్టా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రెడ్డి జాగృతి అంటే ఒక వ్యవస్థ కాదని, రెడ్డి జాగృతి అంటే ప్రపంచంలో ఉండే ప్రతి రెడ్డి సోదరుడికి ఒక భరోసా అని అన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో రెడ్డి బంధువులు పేదరికంతో అల్లాడుతున్నారని, ఆర్ధికంగా వెనుకబడిన రెడ్డి కులస్తులకు ప్రభుత్వం చేయూతనివ్వాలని ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అండగా ఉండాలన్నారు. దేశానికి రైతు వెన్నెముక లాంటి వాడని, ప్రతి రాజకీయ నాయకుడు చెబుతుంటాడని, కాని ఈరోజు రైతు అనేవాడే కనుమరుగైపోయే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం రైతాంగాన్ని పట్టించుకోకపోతే రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతుతో పోరాటానికి దిగుతామని రెడ్డి జాగృతి రాష్ట్రంలో ఉన్న అన్ని రెడ్డి సంఘాలతో కలుపుకొని రెడ్డిలకు రావాల్సిన హక్కుల కోసం భవిష్యత్తులో పెద్దఎత్తున పోరాటానికి కూడా వెనుకాడమని అన్నారు.

ఈ కార్యక్రమంలో రెడ్డి జాగృతి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు మల్లిఖార్జున్‌రెడ్డి, విద్యార్థి యువజన ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షులు కోటిరెడ్డి, విద్యార్థి యువజన జాతీయ అధ్యక్షులు బుట్టంగారి మాధవరెడ్డి, సోషల్ మీడియా ఐటి వింగ్ జాతీయ అధ్యక్షులు తిరుమలరెడ్డి, రాయలసీమ ఇన్‌ఛార్జ్ వినిత్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ రమణారెడ్డి, నెల్లూరు రెడ్డి జాగృతి గౌరవసలహా అధ్యక్షులు రవీంద్రరెడ్డి, గోసల సురేంద్రరెడ్డి, మదన్‌కుమార్‌రెడ్డి, గంగిరెడ్డి, విజయకుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, కావలిరెడ్డి సంఘం నాయకులు కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇండియా బుక్‌ఆఫ్ రికార్డ్స్‌లో త్రిషాంత్

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తమ కుమారుడు శింగంశెట్టి శ్రీసాయి త్రిషాంత్‌కు స్థానం దక్కిందని నెల్లూరు వేదాయపాలెంకు చెందిన అశోక్‌కుమార్ తెలిపారు. సోమవారం నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ తమ కుమారుడు అయిదేళ్ల వయసులో గతేడాది డిసెంబర్ 12వ తేదీన 1 నుంచి 100 వర్గాలను నాలుగు నిమిషాల్లో చెప్పాడని పేర్కొన్నారు. రెండేళ్ళ వయస్సులోనే 180 జాతీయ జెండాలను గుర్తించడంతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కిందని పేర్కొన్నారు.

# అమరావతి కన్నీటి గాధలు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర విభజన తర్వాత ఏపికి అమరావతిని రాజధానిగా ప్రకటిస్తూ సీఎం చంద్రబాబు చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. అయితే ఆయన అమరావతిని అమరావతిగా ఉంచడం లేదు... అమరావతిని సింగపూర్ చేస్తానని ఒకసారి, బ్యాంకాక్ చేస్తానని ఇంకోసారి, బీజింగ్, టోక్యో, వాషింగ్టన్, దావోస్, కొలంబో... ఇలా అమరావతిని వీటి మాదిరిగా చేస్తానని చెప్పి చంద్రబాబు ప్రపంచంలో వున్న ప్రధాన నగరాలన్నింటిని ప్రస్తావించాడు. అమరావతి రాజధాని డిజైన్‌ల కోసమని సినిమా సెట్టింగ్‌లు చూసి దర్శకులను కూడా సంప్రదిస్తుండడం చూస్తున్నాం. రాజధాని నిర్మాణానికి సినిమా డైరెక్టర్‌లకు సంబంధ మేంటి? అద్భుతమైన రాజధానిని నిర్మిస్తామంటూ చంద్రబాబు ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించాడు. మాస్టర్‌ప్లాన్ మ్యాప్ రాగానే 'అహోఅమరావతి' అంటూ పచ్చపత్రికలు డబ్బాకొట్టాయి. రాజధాని వస్తే మీరు సత్తుగిన్నెల్లో కాదు బంగారుపళ్ళాల్లో పంచ భక్ష పరమాన్నాలు తినొచ్చంటూ రైతుల వద్ద నుండి 33వేల ఎకరాలు మూడు పంటలు పండే భూములు తీసుకున్నారు. భూములకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా వారి పొలాల్లో వారికే స్థలాలు ఇచ్చేలాగా అగ్రిమెంట్లు ఇచ్చారు. పొలాలు లాక్కోగానే పంటలు వేయనీయ లేదు. పచ్చటి పొలాలు బీళ్లుగా మారాయి. వెలగపూడిలో సచివాలయం కట్టారు. మిగతా నిర్మాణాలపై క్లారిటీ లేదు. అసలు ఇంతవరకు కాంట్రాక్ట్ ప్రక్రియ పూర్తి కాలేదు. అసలు రాజధానిని కట్టడానికి ప్రభుత్వం వద్ద డబ్బులు లేవు. కేంద్రం ఇవ్వడం లేదు. చంద్రబాబు అంచనాకు కేంద్రం ఇస్తున్న నిధులకు కొండ, బండ మధ్య ఉన్నంత తేడా వుంది. ఇక విభజన సమయంలో మన రాష్ట్రం ఎంత లోటు బడ్జెట్‌లో ఉందో ఇప్పుడు కూడా అంతే లోటుబడ్జెట్‌లో వుంది. దీనికి కారణం పట్టిసీమ, పుష్కరాలు, కానుకలు, విదేశీ ప్రయాణాలు, మజ్జిగ ప్యాకెట్లు పేరుతో చంద్రబాబు చేసిన దండగ ఖర్చులే!

రాజధాని ప్రక్రియ ప్రారంభమై మూడేళ్లు కావస్తుంది. దాదాపు రెండు న్నరేళ్ల నుండి రైతులు పైర్లు వేయడం లేదు. రైతులకు పనులు లేవు. రైతు కూలీలు అమరావతి ప్రాంతం నుండి ఇతర ప్రాంతాలకు పనుల కోసం వలసపోతున్నారు. రైతులు ఇప్పటివరకు పొదుపు చేసిన డబ్బులతో లేదా ఇతర ప్రాంతాలలో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్న బిడ్డలు పంపించిన డబ్బులతోనో కాలం వెళ్లదీసారు. కాని ఇలా ఎంత కాలమని... మూడేళ్లయినా రాజధాని ముందుకు కదల్లేదు. మహా అంటే ఇంకో ఏడాది పనులు జరుగుతాయి... తర్వాత ఎలక్షన్ ట్రెండ్ మొదలవుతుంది. ఈ ఏడాదిలోపు ఇలా మాస్టర్‌ప్లాన్‌లతోనే కాలయాపన జరుగుతుంది. రేపు ఎలక్షన్‌లో రాజెవడో, రైతెవడో? తెలుగుదేశం తిరిగి అధికారంలోకి వస్తుందన్న గ్యారంటీ లేదు. ఒకవేళ జగన్ అధికారంలోకి వస్తే చంద్రబాబు లాగా అమరావతికి ఎందుకు ప్రాధాన్యత నిస్తాడు? అమరావతిని రాజధానిగానే కొనసాగించినా ఏ ఐదు వేల ఎకరాలకో పరిమితం చేస్తాడు. అప్పుడు రైతుల భూములు తిరిగి రైతులకే రావచ్చు.

రేపనేది ఎలావున్నా ఇప్పుడు మాత్రం అమరావతి రైతుల్లో నిలువెత్తు నిరాశ కనిపిస్తోంది. తమను రైతులుగా నిలబెట్టి, తమ కడుపునింపిన పొలాలు మూడేళ్లుగా బీళ్లుగా పడివుండడాన్ని చూసి అక్కడి రైతులే ఆవేదన చెందుతున్నారు. రాజధాని పరిస్థితి ఇలానే కొనసాగితే అమరావతి కేంద్రంగా భవిష్యత్‌లో మరెన్నో కన్నీటి గాథలు చోటు చేసుకుంటాయనడంలో సందేహం లేదు.

# ఒక్కడికే...

(మొదటి పేజీ తరువాయి)

ఎత్తులు, నాయకుల ఆలోచనలు అర్థం కావాలంటే ప్రభుత్వంలో ఉండాలి. అందుకోసమే లోకేష్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవాలని భావిస్తున్నారు. లోకేష్‌కైతే ఏకంగా సీఎం కుర్చీనెక్కాలనే వుంది. ఇంట్లో ఆ విధమైన ఒత్తిడి కూడా వున్నట్లు తెలుస్తోంది. లోకేష్‌కు సీఎం కుర్చీ ఇస్తే చంద్రబాబు ఎక్కడికి పోవాలి. ఇప్పుడు ఢిల్లీ వెళ్లి చక్రం తిప్పడానికి కూడా అవకాశాలు లేవు కదా! అందుకే ముందు లోకేష్‌ను మంత్రివరకు పరిమితం చేయాలనుకుంటున్నారు. మార్చి లేదా ఏప్రిల్ నెలలో ఎమ్మెల్సీ ఎన్నికలున్నాయి. ఎమ్మెల్యేల కోటాలో నుండి లోకేష్‌ను ఎమ్మెల్సీగా ఎన్నుకుని, ఆ తర్వాత మంత్రివర్గంలోకి తీసుకోవడానికి నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే మొదట లోకేష్ ఒక్కడితోనే మంత్రివర్గ విస్తరణ జరుగుతుంది. ఆ తర్వాత చంద్రబాబుకు బుద్ధిపుట్టి ఇవ్వాలనుకుంటే కొద్దికాలం తర్వాత ఇంకో నలుగురైదుగురికి మంత్రి పదవులు రావచ్చు.

# నెల్లూరుకి శని పట్టిందా...?

(మొదటి పేజీ తరువాయి)

పోస్టర్లకూ అసలు కొదవ లేదు. గౌరవ మంత్రిగారి ఆశీస్సులతో ఎంఎల్‌సి పట్టభద్రుల నియోజకవర్గానికి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయన కుడి భుజం అనుచరులు ఓ అడుగు ముందుకేసి ఎక్కడా ఐలాండ్లు అన్నవే కనపడకుండా మొత్తం అన్నింటినీ అభ్యర్థి పోస్టర్లతో ముంచేశారు. ఎలక్షన్ల పోస్టర్లు సైతం ఎక్కడపడితే అక్కడ అంటించకూడదన్న నిబంధన కూడా మంత్రికి ఆయన అనుచర గణానికి వర్తించేటట్లు లేదు. టౌనంతా పోస్టర్లు, ఫ్లెక్సీలతో గలీజుగా తయారైనా ఒక్క అధికారి కూడా దీనిపై స్పందించకపోవడం వింతే కాదు విడ్డూరం కూడా!

## కరువైన శాంతిభద్రతలు

గత యేడాదికాలంలో నేరాలు విపరీతంగా పెరిగిపోయాయి. చైన్ స్నాచింగ్ కేసులతో పాటు, హత్యలు, దొంగతనాలు, దోపిడీలకు నెల్లూరు నగరం నిలయమైపోయింది. అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోవడానికీ నేరాలను నియంత్రించడానికి దొంగలను దుర్మార్గులను గుర్తించడానికి నగరమంతా సి.సి కెమెరాలు పెట్టామని ఓ వైపు చెప్తూనే ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా సీటు బెల్టు పెట్టుకోలేదని, సెల్‌ఫోన్ మాట్లాడుతున్నారని రాంగ్ పార్కింగ్‌లో వాహనం నిలిపారంటూ సి.సి.కెమెరాలు తీసిన ఫోటోల ఆధారంగా ఫైన్ కట్టండంటూ నోటీసులు పంపిస్తోంది పోలీసుశాఖ. తమ డిపార్ట్‌మెంట్‌కు ఆదాయం రాబట్టడంలో చూపిస్తోన్న చొరవ, నేర నియంత్రణలో లేదనే విమర్శ సర్వత్రా వినిపిస్తోంది.

## ఆర్.టి.సితో సహా నగరమంతా...
## బహిరంగ మూత్ర విసర్జన

ఇక ఆర్.టి.సి బస్టాండ్‌తో సహా నగరంలో ఎక్కడపడితే అక్కడ బహిరంగ మూత్రవిసర్జనతో అంతా ఉచ్చగబ్బుగా తయారైంది. కార్పొరేషన్‌కి ప్రత్యేక అధికారిగా వున్న జిల్లా కలెక్టర్ సైతం కార్పొరేషన్‌తో ఎందుకొచ్చిన పరేషాన్ అన్నట్లుగా వుండిపోతున్నారు. నగరంలోని అన్ని విభాగాలు కార్పొరేషన్ విధులతోనే ముడిపడి ఉంటాయి. చివరకు ట్రాఫిక్ నియంత్రణ సక్రమంగా జరగాలన్నా కార్పొరేషన్ సహకారం అవసరం. అటు పారిశుద్ధ్యం, పట్టణ సుందరీకరణ, డ్రైనేజీ వ్యవస్థ, అక్రమ కట్టడాల నియంత్రణ, నిర్ణీత ప్రదేశాలలో పెయిడ్ పార్కింగ్... ఇవన్నీ కార్పొరేషన్ బాధ్యతలే. అయితే నెల్లూరు కార్పొరేషన్‌కి సరైన అధికారిని నియమించే ఆలోచనే లేని ఇద్దరు పట్టణాభివృద్ధి శాఖల మంత్రుల పుణ్యమా అని నగరం అధోగతి పాలైపోయింది.

బీజేపీకి ఒక్క సీటు కూడా రాలేదు కదా, నాకెందుకొచ్చింది అని వెంకయ్యనాయుడు, ప్రజల ఓట్లతో నేను మంత్రిని కాలేదు కదా నాకేం సంబంధం అని నారాయణ... ఇద్దరూ నెల్లూరు కార్పొరేషన్‌ని కార్పొరేషన్ అధికారులని ఊరి మీదకి వదిలేయడంతో ఇక్కడ వారిదే ఇష్టారాజ్యమైపోయింది. ప్రభుత్వాలు మారి 3సంవత్సరాలు పూర్తి కానున్నా అటు కేంద్రంలోనూ ఇటు రాష్ట్రంలోనూ దోస్తులే అధికారంలో వున్నా నెల్లూరు నగరం నరక కూపంగానే మిగిలిపోయి వుందంటే నిజంగా నెల్లూరుకు శనిపట్టింది అనిపిస్తోంది. శని ఒక్కో దశలో నిర్ణీత కాలం పాటు ఉంటుందంటారు. మరి నెల్లూరుకు పట్టిన శనికి ఇప్పటికి మూడేళ్లు కావస్తోంది. మరి ఇంకైనా వీడుతుందో లేక మరి కొన్నేళ్లు పట్టిపీడిస్తుందో... వేచిచూడాల్సిందే!

## కార్డు ద్వారా 10వేలు

పెద్దనోట్ల రద్దు తర్వాత కరెన్సీ కోసం ప్రజలు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. బ్యాంకుకు పోతే ఒక్కో ఖాతాదారుడికి 24వేలు... ఏటిఎంకు పోతే నాలుగున్నర వేలు.... ఈ డబ్బుల కోసం గంటల కొద్దీ క్యూలలో నిలబడి ఉండడం... ఈ కష్టాల నుండి కొంత ఊరట కలిగిస్తూ ఆర్‌బిఐ ఏటిఎం ద్వారా నగదు విత్‌డ్రాను 10వేల రూపాయలకు పెంచింది. సేవింగ్ ఖాతాల నుండి వారానికి 24వేలన్న పరిమితి అలాగే వుంది. కరెంట్ అకౌంట్ నుండి విత్‌డ్రాను మాత్రం 50వేల నుండి లక్షకు పెంచడం వ్యాపారులకు కొంచెం ఊరట కలిగించే విషయం.


# చంద్రబాబు పాచిక

(మొదటి పేజీ తరువాయి)

అధ్యయనం కోసమంటూ మంజునాథ కమిషన్ వేసాడు. ఒక వర్గానికి రిజర్వేషన్లు ఇవ్వాలంటే ఇంతకాలం సాగదీయాల్సిన అవసరం లేదు. 2004లో ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న వై.యస్., అధికారంలోకి రాగానే దానిని ఆచరణలో చూపించాడు. చంద్రబాబు మాత్రం కాపులను బి.సిలలో చేర్చితే మిగతా బి.సి కులాలు వ్యతిరేకమయ్యే అవకాశముంది. అదీగాక కాపులకు రిజర్వేషన్లు ఇచ్చినా గతం లాగా ఈసారి అందరూ మద్దతునిస్తారన్న గ్యారంటీ లేదు. కాని కాపులకు రిజర్వేషన్లు ఇస్తే తెలుగుదేశంకు వ్యవస్థాపక మద్దతుదారులైన బి.సిలు దూరం కావడం మాత్రం గ్యారంటీ! ఈ లెక్కలు వేసుకునే కాపుల రిజర్వేషన్లను ఆయన నానుస్తున్నాడు.

అయితే కాపులు తనకు దూరమై జగన్‌కు దగ్గరైతే వచ్చే ప్రమాదం కూడా ఆయనకు తెలుసు. రాష్ట్రంలో కులపరమైన ఓట్లలో కాపులదే అగ్రస్థానం. అందుకే కాపుల ఓట్లు మొత్తం వైకాపా వైపు వెళ్లకుండా వాటిని దారిమళ్లించే పనులు చేపట్టాడు చంద్రబాబు. అందులో ఒకటి కాపుల్లో చీలిక తేవడం. ఇందుకు టీటీడీ బోర్డు మాజీసభ్యుడు ఓ.వి. రమణను ప్రయోగించారు. ఆయన కాపులు, బలిజలు ఒకటి కాదని, బలిజలను బి.సిలుగా గుర్తించాలని, కాపుల ముసుగులో బలిజలు అన్యాయానికి గురవుతున్నారని కొత్త పాటందుకున్నాడు. కృష్ణా అవతల బలిజ కులస్తులను కాపులుగా పేర్కొంటుంటారు. కృష్ణ ఇవతల గుంటూరు, నెల్లూరు, ప్రకాశం, రాయలసీమ జిల్లాలో బలిజలను అదే పేరుతో పిలుస్తుంటారు. కాని ఇక్కడ కులం ఒక్కటే! అయితే చంద్రబాబు తెలివిగా దీనిని రెండుగా చేసి చూపించే ప్రయత్నం చేస్తూ వారిలో చీలికకు పాచిక వదిలారు.

కాపుల ఓట్ల మళ్లింపుకు చంద్రబాబు చేతిలోవున్న మరో బలమైన అస్త్రం పవన్‌కళ్యాణ్. 2014 ఎన్నికల్లో తెలుగుదేశంకు కాపుల ఓట్లు వేయించి చంద్రబాబుకు ప్రత్యక్ష సాయం అందించిన పవన్, ఈసారి అదే చంద్రబాబుకు పరోక్షంగా తోడ్పాటునందించనున్నాడు. ఈసారి పవన్ చెప్పిన కాపులు తెలుగుదేశంకు ఓట్లేయరు. కాబట్టి అదే పవన్ సారధ్యంలోని జనసేన పార్టీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తుంది. కాపుల ప్రాబల్యం అధికంగా వున్న జిల్లాల్లో, నియోజకవర్గాల్లోనే జనసేన అభ్యర్థులు నిలబడతారు. కాబట్టి వైకాపాకు వెళ్లే ఓట్లు జనసేనకు పడతాయి. ప్రభుత్వ వ్యతిరేకత ఓటంతా వైకాపా, జనసేనల మధ్య చీలిపోతుంది. అప్పుడు తెలుగుదేశంపార్టీ లబ్దిపొందుతుంది. ఇదే కాపుల ఓట్లపై చంద్రబాబు విసరనున్న పాచిక! పవన్, చంద్రబాబు చేతిలో పావుగానే వుంటున్నాడు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఆయన రేపు ఎన్నికల్లో పోటీ చేయొచ్చు. ఇదే జరిగి కాపుల ఓట్లు చీలిపోతే, వాళ్లు మద్దతిచ్చిన పవన్ అధికారంలోకి రాలేక, ఇటు వైకాపా అధికారంలోకి రాలేకపోతే రాష్ట్ర రాజకీయాల్లో ప్రాబల్యం కోల్పోయేది కూడా కాపులే!



# పనులు వై.యస్.వి...

# ప్రారంభోత్సవాలు బాబువి

- ఆంధ్రాలో ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల నిర్మాత వై.యస్సే

సాగునీటి ప్రాజెక్టులే ఆధునిక దేవాలయాలని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఏనాడో చెప్పారు. నిజమే... కృష్ణదేవరాయలు నిర్మించిన చెరువులు, బ్రిటీష్ వారి హయాంలో సర్ ఆర్థర్ కాటన్ కట్టించిన ధవళేశ్వరం, ప్రకాశం, నెల్లూరు ఆనకట్ట వంటి సాగునీటి కేంద్రాలు, స్వాతంత్ర్యం వచ్చాక నెహ్రూ, ఇందిరా గాంధీల హయాంలలో నిర్మించబడ్డ శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి డ్యామ్‌లు, ఎన్టీఆర్ పాలనలో పురుడుపోసుకున్న తెలుగుగంగ, సోమశిల, కండ్లేరు వంటి ప్రాజెక్టులు ఈ రాష్ట్ర ప్రజలకు ఆధునిక దేవాలయాలయ్యాయి. ఆ దేవాలయాలే లేకపోతే ఈరోజు రాష్ట్ర ప్రజలకు, రైతాంగానికి జలమెక్కడిది? జీవం ఎక్కడిది?

వారిలాగే ఆంధ్రప్రదేశ్‌లో ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లను పవిత్ర దేవాలయాలుగా భావించి జలయజ్ఞాన్ని ఓ దీక్షగా చేపట్టిన నాయకుడు స్వర్గీయ డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి. 1995-2004ల మధ్య ముఖ్యమంత్రిగా చంద్రబాబు పాలనలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన జరగలేదు. ఒక్క పెండింగ్ ప్రాజెక్ట్‌నూ పూర్తి చేయలేదు. ఆయన పాలనా కాలాన్ని రైతాంగానికి చీకటి యుగంగా చెప్పుకోవచ్చు. ప్రపంచ బ్యాంకుల నుండి తెచ్చిన వేలకోట్ల అప్పులను కంప్యూటర్లు, సిమెంట్ రోడ్లు వంటి పనులకే తగలేసాడు. చంద్రబాబు హయాంలో రైతులు చీకటి రోజులే గడిపారు.

2004లో వై.యస్. ముఖ్యమంత్రి అయ్యాకే రైతులకు స్వర్ణయుగం మొదలైంది. రైతులకు పెద్దపీట వేశాడు. ఉచిత విద్యుత్‌తో రైతాంగాన్ని ఆదుకున్నాడు. అన్నింటికి మించి ఆయన చేపట్టిన జలయజ్ఞం రైతుల జీవితాలనే మార్చేసింది. అన్ని జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్ట్‌లను మొదలుపెట్టడంతో అంతకు ముందు 10వేలు కూడా చేయని ఎకరా భూమి ధర 10లక్షలకు చేరింది. ఇక ఆయా జిల్లాల్లో సెజ్‌ల మూలంగా భూముల ధరలైతే ఎకరా కోటి కూడా దాటింది. రాష్ట్రంలో భారీ సాగునీటి ప్రాజెక్ట్‌లను మొదలుపెట్టింది వైయస్సే! ఏపికి వరం లాంటి పోలవరం ప్రాజెక్ట్‌కు ఆద్యుడు వైయస్సే! ఏ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కైనా ప్రధాన సమస్య ప్రధాన కాలువలు తవ్వడానికి భూసేకరణ. వై.యస్. ముందుచూపుతోనే పోలవరం కుడి, ఎడమ కాలువలను పూర్తి చేయించాడు. భూసేకరణ సమస్య లేకుండా చేసాడు. ఆ కాలువలు ఉండబట్టే చంద్రబాబు ఇటీవల పట్టిసీమను హడావిడిగా పూర్తి చేసి ఆ కాలువల గుండానే నీళ్లొదిలాడు. వైయస్సే 2014 దాకా ఉండుంటే పోలవరం పూర్తయ్యి, ప్రజలు దాని ఫలితాలను అనుభవిస్తుండేవాళ్లు. ఆయన మరణమే రాష్ట్ర రైతాంగానికి శాపమైంది. కృష్ణానదిపై పులిచింతల ప్రాజెక్ట్‌కు పునాది వేసి, పనులు మొదలుపెట్టించింది వైయస్సే! హంద్రీనీవా, వెలుగొండ, ఇటీవల చంద్రబాబు ప్రారంభించిన మచ్చుమర్రి వంటి ప్రాజెక్ట్‌లన్నీ కూడా వై.యస్. పుణ్యమే!

ఆనాడు వై.యస్ పునాది వేసి మొదలుపెట్టిన ప్రాజెక్ట్‌లనే ఈరోజు చంద్రబాబు ఆర్భాటంగా ప్రారంభిస్తున్నారు. రాష్ట్రంలో ప్రాజెక్ట్‌లన్నింటిని తానే కట్టించినంత బిల్డప్ ఇస్తున్నాడు. ఇటీవల కర్నూలు జిల్లా తడకనపల్లెలో నిర్వహించిన సభలో స్థానిక ఎమ్మెల్యే ఐజయ్య ఇదే విషయాన్ని చెబుతుంటే చంద్రబాబు అతని మైక్ కట్ చేశారు. మైక్‌లు కట్ చేసి మాట్లాడించకపోయినంత మాత్రాన నిజాలు మరుగునపడతాయా?

ఈ రాష్ట్రాన్ని ఏలినవారిలో ఒక్కొక్కరికి ఒక్కో బ్రాండ్ ఉంటుంది. ఎన్టీఆర్ అంటే రెండు రూపాయల కిలో బియ్యం, తెలుగుగంగ గుర్తుకొస్తాయి. చంద్రబాబు అంటే కంప్యూటర్లు, హైటెక్ సిటీ గుర్తుకు వస్తాయి. వై.యస్ అంటే ఆరోగ్యశ్రీ, సాగునీటి ప్రాజెక్ట్‌లు అందరి మనసుల్లో మెదులుతాయి. చంద్రబాబు ఎన్ని ప్రయత్నాలు చేసినా, ప్రజల మనసుల్లో నుండి ఆయన బొమ్మ తీసేయాలని ఎంత గింజుకున్నా ఈ రాష్ట్రంలోని ప్రతి ఇరిగేషన్ ప్రాజెక్ట్ నుండి విడుదలయ్యే నీళ్ళల్లో వై.యస్. ప్రతిబింబమే కనిపిస్తుంది.

# ఖేలో సింహపురి

- ఉత్సాహంగా ప్రారంభమైన క్రీడలు



సంక్రాంతి పండుగ వెళ్లింది... నెల్లూరులో క్రీడా పండుగ మొదలైంది. నెల్లూరంతా సందడి నెలకొంది. నెల్లూరు ఏ.సి స్టేడియంలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా జాతీయ స్థాయి క్రీడా పోటీలను 19వతేదీ కేంద్ర పట్టణాభివృద్ధిశాఖామంత్రి యం.వెంకయ్య నాయుడు శాంతి కపోతాలను ఎగురవేసి లాంఛనంగా ప్రారంభించారు. అండర్-14 విభాగంలో ఖోఖో, కబడ్డీ, ఉషు పోటీలకు ఏ.సి స్టేడియం వేదికైంది. దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారులతో స్టేడియం కళకళలాడింది. ఈ పోటీలను ప్రారంభించిన వెంకయ్య మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తి ఉట్టిపడేలా ఈ పోటీలు జరగాలన్నారు. ప్రతి వ్యక్తి దైనందిన జీవితంలో క్రీడలు ఒక భాగం కావాలన్నారు. క్రీడలతో మనిషి శారీరక, మానసిక దృఢత్వం సాధిస్తాడన్నారు. చిన్నప్పుడు కబడ్డీ బాగా ఆడేవాడినని, ఇప్పుడు 68ఏళ్ల వయసులో కూడా రోజుకో గంట షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్నట్లు చెప్పారు. శాప్ ఆధ్వర్యంలో 37వ జాతీయ స్థాయి క్రీడలను నెల్లూరులో నిర్వహించేందుకు మొగళ్లపాలెం వద్ద 150ఎకరాలలో క్రీడాగ్రామాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో కూడా క్రీడలను ప్రోత్సహించాలని కోరారు. ఏ.సి స్టేడియాన్ని దాదాపు 3కోట్లతో ఆధునీకరించామన్నారు. ఈ సందర్భంగా కోవూరు, వెంకటగిరి, ఉదయగిరి, వింజమూరులలో ఏర్పాటు చేయనున్న క్రీడా వికాస కేంద్రాల శిలాఫలకాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఖేలో ఇండియా, శాప్, జిల్లా స్పోర్ట్స్ అథారిటి పతకాలను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, శాసన మండలి సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికార ప్రతినిధి కన్వర్ జిత్ సింగ్, శాప్ ఛైర్మెన్ పి.ఆర్.మోహన్, డైరెక్టర్ రవీంద్రబాబు, డిఎస్‌డిఓ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



## అలయన్స్ గ్రూప్ ఆధ్వర్యంలో

# లక్ష మొక్కలే లక్ష్యంగా వృక్ష ఉద్యమం

నెల్లూరీయుడు, రియల్ ఎస్టేట్ రంగంలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన అలయన్స్ గ్రూప్ ఛైర్మెన్ నంబూరు మనోజ్ ఆధ్వర్యంలో చెన్నై కేంద్రంగా ఓ విశిష్ట ఉద్యమానికి అంకురార్పణ జరిగింది. గత యేడాది నవంబర్‌లో సంభవించిన 'రేవాన్' తుఫాను మూలంగా చెన్నై మహానగరం అతలాకుతలం కావడం తెలిసిందే! ఎన్నో ఏళ్ళుగా చెన్నై వీధుల్లో నీడనిస్తున్న చెట్లు ఈదురు గాలుల ధాటికి నిలువునా నేలకూలాయి. చెన్నై రోడ్లన్నీ వృక్షాలు లేక బోసిపోయినట్లైంది. ఈ నేపథ్యంలో చెన్నైని మళ్ళీ హరితవనంగా మార్చడానికి మనోజ్ శ్రీకారం చుట్టారు. చెన్నైలో లక్ష మొక్కలు నాటడానికి అంకురార్పణ చేశారు. 'రండి చెన్నైని మళ్ళీ పచ్చదనంతో నింపుదాం' అంటూ ప్రజలకు పిలుపునిస్తూ ఈ హరిత ఉద్యమంలో వారినీ భాగస్వామ్యులను చేస్తున్న మనోజ్ సామాజిక సేవకు 'లాయర్' అభినందనలు.




# మాల్‌లో మాగుంటోళ్ళ హాల్స్

- అయిదు స్క్రీన్స్‌ను ప్రారంభించిన కలెక్టర్



సినిమాను తిలకిస్తున్న కలెక్టర్ ముత్యాలరాజు, జేసి ఇంతియాజ్ అహ్మద్, ఎస్పీ విశాల్‌గున్నీ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

మహానగరాలకు ధీటుగా నెల్లూరు నగరంలో నిర్మితమైన ఎం.జి.బి మాల్‌లో ఐదు సినిమా స్క్రీన్స్‌ని 'ది సినిమా' పేరుతో ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పటికే నెల్లూరు నగరంలో ఎస్2లో మూడు స్క్రీన్‌లను గాక, అర్చన, లీలామహల్‌లను నిర్వహిస్తున్న మాగుంటోళ్ళే, మాల్‌లోని ఐదు స్క్రీన్‌లను నిర్వహించనున్నారు. అత్యాధునికంగా రూపొందించిన ఈ ఐదు స్క్రీన్‌లను ఈ నెల 13వ తేదీన జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు చేతులమీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ, జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిఎస్పీ రాముడు తదితరులు పాల్గొన్నారు. ఎస్2 మేనేజర్ మాగుంట ఆదిత్యరెడ్డి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## సైన్స్‌సిటీ సిఇవో

# కృష్ణారావుకు ఎల్లాప్రగడ అవార్డ్



వందుల మాంత్రికుడు డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు పేరిట ప్రతియేటా అందజేస్తున్న అవార్డును 2017కు గాను ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటి సిఇవో, జీన్ ఎక్స్‌ప్రెషన్ సిస్టమ్స్, అమెరికా డాక్టర్ అప్పసాని కృష్ణారావుకు ఇవ్వనున్నట్లు నెల్లూరులోని డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బా రావు ఫౌండేషన్ ఛైర్మెన్ డాక్టర్ ఎ.జగదీష్ తెలిపారు. డాక్టర్ కృష్ణారావు బయాలజీ, కెమిస్ట్రీ, జెనటిక్స్, మెడికల్ సైన్స్‌లో విశేషకృషి చేశారు. ఇదివరలో కృష్ణారావు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హార్వర్డ్ మెడికల్ స్కూల్, ఎమ్ఐటి అమెరికాలో పనిచేశారు. నోబెల్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్ హర్‌గోవింద్ ఖొరానా లేబొరేటరీలో సింతటెక్ రోడోప్సిన్ జీన్‌ను కనుగొన్న మొదటి శాస్త్రవేత్త ఆయనే!

మార్చి ఆఖరు వారంలో నెల్లూరులో జరిగే కార్యక్రమంలో డాక్టర్ ఎ.కృష్ణారావు ఈ అవార్డును అందుకోనున్నారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com